
చైనీస్ బ్యూటీ
MVS
మధుబాబు

# చైనీస్ బ్యూటీ

తడి ఆరని కురులను టర్కీ టవల్ తో తుడుచుకుంటూ బాత్ రూమ్ లోనుంచి బయటికి వచ్చింది బిందు. కిచెన్ వైపు అడుగులు వేస్తూ, బెడ్ రూమ్ లోకి తొంగి చూసింది.

లేద్దామా, వద్దా అని ఆలోచిస్తున్నాడు బెడ్ మీద వున్న పెద్ద మనిషి.

నవ్వుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళింది బిందు. ఫ్లాస్క్‌లో పోసి వుంచిన కాఫీని ఒక కప్పులోకి వంచుతూ "లేచావా?" అని కేక వేసింది.

"ప్రాంప్ట్‌గా వచ్చింది సమాధానం "లేవలేదు" అంటూ.

నువ్వు వట్టి మాటలతో లేస్తే యిక లేనిదేముంది? వస్తున్నా వుండు...."

ఆ మాట వినగానే కాళ్ళక్రిందకి పోయిన కాబూల్ శాలువాని గబగబా తలమీదికి లాక్కున్నాడు షాడో. ఎందుకైనా మంచిదని ఒక దిండును కూడా తలకు అడ్డుపెట్టుకుని కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

పాదాలకున్న వెండిపట్టాలు సద్దు చేయకుండా, అడుగులో అడుగు వేసుకుంటూ బెడ్ రూమ్ లోకి వచ్చింది బిందు. ముని వేళ్ళతో శాలువాను పక్కకు తొలగించి కాఫీ కప్పును పైకి ఎత్తింది.

"కాబూల్ శాలువా యిది. కాఫీ మరకలు పడితే యిక ఎందుకూ పనికిరాకుండా పోతుంది" కళ్ళు తెరవకుండానే హెచ్చరించాడు షాడో.

"మరేం ఫర్వాలేదు. కొత్తది కొనుక్కొస్తాను"

"ప్లీజ్ బిందూ... పొద్దున్నే కాఫీ వంటిమీద చిలికితే అశుభం. ఆరోజంతా కాఫీ మీదపడుతూనే ఉంటుందట!!"

"నీ శుభాలు అశుభాల సంగతి పోయి నీ ముసలిబాస్ కి చెప్పుకో. నేను పది లెక్కపెట్టేలోపుగా లేస్తే సరేసరి. లేదా యివ్వాళ నువ్వు కాఫీలో స్నానంచేసి తీరతావ్."

"బిందూ.. ప్లీజ్....."

"ఒకటి" అన్నది బిందు.

'ఇదెక్కడి గోలరా భగవంతుడా! పొద్దున్నే నిద్దర పోనీయకుండా ఈ సవతి పోరేమిటి నాకు?' తనలో తను గొణుక్కున్నాడు షాడో.

"రెండు......మూడు.....నాలుగు.....ఐదు....."గబగబా ఎనౌన్స్ చేసింది బిందు.

"అంత తొందరగా లెక్కపెడతావేమిటి? మెల్లిగా చెప్పు." రాజీ పడందే లాభం లేదన్న విషయం అర్థమై కళ్ళు తెరిచాడతను.

"ఆరు....ఏడు.....ఎనిమిది....."

"అసలు నీ ఉద్దేశ్యం ఏమిటి?" కోపంగాచూస్తూ అడిగాడతను.

"తొమ్మిది!!" అన్నది బిందు. ఆ మాట వినిపించుకోకుండా.

చటుక్కున లేచి కూర్చున్నాడతను. "రోజు రోజుకూ నీ ఆగడం హద్దులు మీరిపోతుంది. ఎప్పుడో దొరుకుతావ్ నా చేతికి..." అంటూ.

నవ్వుతూ కాఫీ కప్పును అతని నోటికి అందిచింది బిందు. ఉన్నట్లుండి భూకంపం వచ్చినట్లు దడదడలాడిందా గది. బిందు చేతిలోంచి కప్పు అవతల పడటం, దానిలోని కాఫీ

అంతా కాబూల్ శాలువా మీద ఒలకడం ఒకేసారి జరిగిపోయింది.

"వాటీజ్ దిస్? వాట్ హాపెన్డ్?" అంటూ ఒక్కగంతులో మంచం మీదనుంచి అవతలకు దూకాడు షాడో.

అదే సమయంలో మరోసారి ప్రత్యక్షమయ్యిందా ప్రకంపనం. వెయ్యి బాంబర్ విమానాలు నేలకు అతి దగ్గరగా ఎగురుతున్నట్లు ఒక వికృతమైన శబ్దం వినవస్తోంది. ఏదో పెద్ద రాక్షస హస్తం పట్టుకొని అటూ యిటూ కదిలిస్తున్నట్లు తీవ్రంగా చలిస్తోంది ఆ భవనం.

"మైగాడ్! భూకంపం!! కమాన్ బిందూ!!! లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్!" అంటూ బిందు చేయి పట్టుకొని బయటికి పరుగు తీశాడతను.

ముఖ ద్వారాన్ని దాటుతుండగా పెద్ద బాంబు ఒకటి పడినట్లు దడదడలాడుతూ నేలకూలింది డ్రాయింగ్ రూమ్ పైకప్పు. దాన్ని అనుసరించి సర్వనాశనమైపోయింది కిచెన్. భవనం చుట్టూ వున్న చెట్లు కూకటి వ్రేళ్ళతో సహ బయటికి

వచ్చేస్తున్నాయి.

సగం కూలిపోయిన ప్రహరీగోడమీదినుంచి అవతలకి జంప్ చేసి రోడ్ మీదికి పరిగెత్తాడు షాడో.

పలుగులు పెట్టి పొడిచినట్లు బీటలు వారిందా తారురోడ్డు. చూస్తూ చూస్తూండగానే ఆ బీటలు పెద్ద పెద్ద పగుళ్ళుగా మారుతున్నాయి.

"ప్రపంచంలో వున్న పట్టణాలన్నిటికంటే సురక్షితమైన స్థానంలో వున్నది ఈ ఢిల్లీ నగరం. ఇక్కడ భూకంపాలు రావటానికి అవకాశాలు లేవు..... కానీ వచ్చింది ఒకసారి కాదు. రెండు సార్లు..." రోడ్డుమీద నిలబడి కూలిపోయిన తమ భవనం వైపు చూస్తూ కామెంట్ చేశాడతను.

రోడ్డుకు అవతలగా వున్న యమునా నదివైపు చూస్తోంది బిందు. వరదలు వస్తున్నట్లు ఎగిరిపడుతున్నదా నది. భూకంపం మరో నాలుగు క్షణాలపాటు కంటిన్యూ అయి వుంటే ఆపైన ఆలోచించటానికి మనస్కరించక తల పక్కకు తిప్పుకున్నదామె.

* * *

"రాజూ! నీకు అన్ని విషయాలు వివరంగా చెప్పటానికి వ్యవధిలేదు. బి రెడీ టు టేకాఫ్. ఇంకో అరగంటలో స్పెషల్ ఢిల్లీ విమానాశ్రయం నుంచి బయలుదేరుతుంది. నిన్ను సిక్కిం సరిహద్దులకు కొంచెం అవతలగా వున్న మన సైనిక శిబిరాల దగ్గిర డ్రాప్ చేస్తుంది.

అక్కడవున్న మన సైనికాధికారులు నిన్ను చైనీస్ సైనికులకు అప్పగిస్తారు. చైనాలో నువ్వు మూడు రోజులు వుంటావ్. ఆ మూడు రోజులలోను అక్కడి అధికారులు చెప్పినట్లు నడుచుకోవాలి...." అంటూ ఆరిపోయిన సిగార్ని అవతలకు విసిరి మరోఫ్రెష్ సిగార్ని వెలిగించారు కులకర్ణి.

పనామా పొగలను రింగులు రింగులుగా సీలింగ్ మీదికి పంపుతున్న షాడో, ఆశ్చర్యంగా చిన్న విజిల్ వేశాడు.

"యస్ రాజు? ఇది మనం కలలో కూడా ఎదురు చూడని డెవలప్మెంట్. నిన్ను చంపటానికి చైనా ప్రభుత్వం చేయని

ప్రయత్నం అంటూ లేదు....కాని ఈ సారి వాళ్ళు ఆ ప్రయత్నాలు పక్కకు నెట్టి మనతో కో ఆపరేట్ చేస్తారు."

పనామాను అవతలకి విసిరి హేండ్ కర్చీఫ్ తో ముఖం తుడుచుకున్నాడు షాడో. చైనీయులు భారతదేశంలో కో ఆపరేట్ చేయడమా? కట్లపాము దొంగచాటుగా కాటువేయటం మానుకున్న రోజున ఆపని సాధ్యమవుతుంది.

షాడో వదనంలో ప్రతిఫలిస్తున్న భావాలను గమనించి దీర్ఘంగా నిట్టూర్చారు కులకర్ణి. నాకు తెలుసు రాజూ! ప్రస్తుతం మనం ఎటూ తేల్చుకోలేని సందిగ్ధ పరిస్థితిలో వున్నాం. మానవుడు కాలుపెట్టలేని, హిమాలయ మంచు మైదానాల్లో ఎక్కడో ఒక అండర్ గ్రౌండ్ లేబరేటరీ ఉన్నదట. అది చైనీయులది కాదు. ఇంతవరకు ఎవరూ కనిపెట్టనటువంటి అపూర్వమైన కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు ఈ లేబరేటరీలో వున్నాయట. ఈ రోజు ఉదయం మన ఢిల్లీ నగరంలో ప్రత్యక్షమైన భూకంపం... ఆపరికరాల వల్లనే ఏర్పడిందట!!"

కుర్చీలో సర్దుకు కూర్చోబోతున్న షాడో ఆ మాట

వినగానే ఎలా వున్నవాడు అలాగే బిగుసుకుపోయాడు.

ప్రకృతి సిద్ధమైన భూకంపాలను మానవులు సృష్టించటమా!!

అది సాధ్యపడుతుందా??

"సాధ్యపడుతుందని అంటున్నారు చైనీస్ ప్రభుత్వఅధికారులు. దేశ బహిష్కరణ శిక్ష విధించబడ్డ కొందరు చైనీస్ సైంటిస్టులు ఈ యంత్రాలను తయారుచేశారట. వారికి సహాయపడుతున్నది ఎవరో.....వారి స్థావరాలు ఎక్కడ వున్నాయో చైనీయులకు తెలీలేదు. ఒకటి మాత్రం ఖచ్చితంగా తెలిసి వచ్చింది. ఆ యంత్రాలు ఎక్కడ వున్నాయో తెలుసుకొని వెంటనే వాటిని నాశనం చెయ్యక పోతే మనకు మనుగడ లేదు. భూకంపాలు రావటానికి అవకాశం లేని ఢిల్లీ నగరంలో భూకంపాన్ని సృష్టించాయవి. అలాగే మన దేశమంతటా అల్లకల్లోలాన్ని సృష్టించి మనల్ను నాశనం చేయవచ్చు. సో..... వుయ్ హవ్ టు వర్క్ ఫాస్ట్." అంటూ టేబిల్ మీదివున్న కాలింగిబెల్ ని నొక్కారు కులకర్ణి.

"యస్ బాస్??" అంటూ వినవచ్చింది సులోచన కంఠం.

"సులోచనా! ఎయిర్ పోర్ట్ కి వెళ్ళాలి... కారును సిద్ధం చేయించు...." ఆర్డర్ యిస్తూ కుషన్ చైర్ మీదివున్న కోటును అందుకున్నారు కులకర్ణి.

"రాజూ! బిందును వాళ్ళ ఫాదర్ యింటికి పంపిద్దాం. నువ్వు తిరిగి వచ్చిన తర్వాత మిగిలిన విషయాలను గురించి ఆలోచించుకుందాం.." అంటూ గది బయటకు దారి తీశారు.

"సార్..... నేను ఇప్పుడు వెళుతున్నది చైనాకు కదూ?" అడిగాడు షాడో.

తల వూపారాయన.

"తిరిగి వస్తానని గ్యారెంటీ ఏమైనా వుందా?"

ముందుకు వెయ్యబోతున్న పాదాన్ని, ఎత్తినట్లే క్రిందికి దించి మెల్లిగా షాడో వైపు తిరిగారు కులకర్ణి.

"అవును సార్....నన్ను ఒంటరిగా పంపించండి. నా

బాధలేవో నేను పడి ఆ లేబరేటరీ ఎక్కడ వున్నా వెతికి పట్టుకంటాను సార్....దయచేసి చైనీయులతో చేతులు కలపమని చెప్పకండి.....ఇటీజ్ టూ డేంజరస్!" గంభీరంగా అన్నాడు షాడో.

"ఇటీజ్ టూ లేట్ మై బాయ్! మనం యినీషియేటివ్ తీసుకొని పరిశోధనలు ప్రారంభించటానికి టైం లేదు. చైనీస్ భూభాగంలో వున్నది ఆ లేబరేటరీ. ఆ పరిసర ప్రాంతాలు వారికి తెలిసినట్లు మనకు తెలియవు. ఎంత బాగా తెలిసినా ఆ లేబరేటరీ ఎక్కడవుందో కనిపెట్టలేక మన సాయం కోరింది చైనీస్ ప్రభుత్వం. ఇటువంటి సమయంలో మనం మన బేదాభిప్రాయాలు మరచి ఒకటి కావాలి. లేకపోతే అటు చైనా యిటు యిండియా స్మశానాలుగా తయారౌతాయి. ఈ రోజు మనం చూసిన దృశ్యం జస్ట్ శాంపిల్ మాత్రమే."బరువుగా నిట్టూరుస్తూ అన్నారు కులకర్ణి.

ఆపైన మాట్లాడి ప్రయోజనం లేదని గ్రహించి, మౌనంగా ఆయన్ను అనుసరించాడు షాడో. హెడ్ క్వార్టర్స్ ముందు రెడీగా వున్నది కులకర్ణిగారి వైట్ అంబాసిడర్.

"హోటల్ అశోకా..." వెనక సీటులో కూర్చుంటూ అన్నారు కులకర్ణి.

సిగరెట్ వెలిగించుకోబోతున్న షాడో ఆశ్చర్యంగా చూశాడు ఆయనవంక.

"రాజూ! ఈ ఎస్సైన్ మెంటులో నువ్వు ఒక్కడివే పని చేయటం లేదు. హిమాలయ పర్వత శ్రేణుల గురించి బాగా తెలిసిన చైనీస్ ఏజెంటు హెల్ప్ నీకు వుంటుంది. మీ యిద్దరు కలిసి వర్క్ చెయ్యాలి....." అన్నారయన. సిగరెట్ వెలిగించుకోవటం కూడా మరిచిపోయి ఆయనవంకే చూస్తూ వుండిపోయాడు షాడో.

హోటల్ అశోకా ముందు ఆగింది అంబాసిడర్. "చంద్రా! బీ రెడీ!! రెండు నిముషాల్లో వచ్చేస్తాం." డ్రయివర్‌ని హెచ్చరించి, హోటల్ పోర్టికో వైపు అడుగులు వేశారు కులకర్ణి.

రూమ్ నెంబర్ త్రీనాట్ ఫోర్ నాలుగవ అంతస్థులో వున్నది. కాలింగ్ బెల్ మీద ఆయన చేయి పడిన మరుక్షణం తెరుచుకున్నాయి తలుపులు.

"ప్లీజ్ కమీన్!" అంటూ బయటికి తొంగిచూసింది ఒక అందాల చైనీస్ బొమ్మ.

"రాజూ!! మీట్ మిస్ లీనా హోరూషీ..." అంటూ ఆమెను పరిచయం చేశారు కులకర్ణి.

హృదయంలో చెలరేగుతున్న భావాలను బయటికి వెలువర్చకుండా, ఎలా వున్నవాడు అలాగే రాతి బొమ్మలా బిగుసుకుపోయాడు షాడో.

***********************

వింటినుంచి వెలువడిన బాణంలా, అడ్డు వచ్చిన మేఘాలను చెల్లా చెదురు చేస్తూ, సిక్కిం సరిహద్దులవైపు దూసుకుపోతున్నది మిలిటరీకి సంబంధించిన డబుల్ యింజన్ డకోటా విమానం.

పాసింజర్ కాబిన్‌లో నాలుగే నాలుగు సీట్లు వున్నాయి. విండోని ఆనుకొని వున్న సీట్లో కూర్చొని నిద్రాదేవతను ఆహ్వానించటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తున్నాడు షాడో.

అతని ప్రక్కనే కూర్చున్నది చైనీస్ సీక్రెట్ ఏజెంట్ మిస్ లీనా హోరూషీ. హోటల్ అశోకాలో వారిద్దరూ హల్లో అంటే హల్లో అని అనుకోవటం తప్ప మరేమీ మాట్లాడుకోలేదు. అసలా అవకాశం కూడా వారికి లభించలేదు. హోటల్ నుంచి బయలుదేరిన పదినిముషాలలో ఎయిర్ పోర్టు చేరుకున్నారు. రన్‌వే మీద రెడీగా వుంది విమానం. వారు ఎక్కగానే ప్రయాణం ప్రారంభించింది. విమానం గాలిలోకి లేచిన క్షణం నుంచి నిద్రపోవటానికి ప్రయత్నిస్తున్నాడు షాడో. కాన్సన్‌ట్రేషన్‌కి అవకాశం యివ్వటం లేదు.

"మిస్టర్ రాజు! నా కంపెనీ నీకు బోర్ కొడుతున్నదా?" ఉండబట్టలేక సూటిగా అడిగేసింది లీనా హోరూషీ.

"అటువంటిదేమీ లేదు. నాకు కొంచెం బద్ధకం ఎక్కువ. నిద్రపోవటం నా హాబీ....." ఆపైన తను నిద్ర నటించటం బాగోదన్న నిర్ణయానికి వస్తూ అన్నాడు షాడో.

చిరునవ్వు నవ్వింది లీనా హోరూషీ.

"నో నో....... మిస్టర్ షాడో! నీ గురించి నాకు బాగా

తెలుసు. నేను సీక్రెట్ ఏజెన్సీలో చేరిన రెండవరోజు నాకో ఫైల్ ని యిచ్చారు మాఅధికారులు. అందులో నిన్ను గురించిన వివరాలన్నీ వున్నాయి. నువ్వు ఎలా మాట్లాడతావ్, ఎలా నడుస్తావ్, నీ హాబీలు, నీ స్పెషాలిటీలు. నీ బలహీనతలు మొదలైన వన్నీ క్లియర్‌గా వివరించబడివున్నాయి. వాటిలో నీకు నిద్ర అనేది అసలు అవసరంలేదేమో అన్న అభిప్రాయం వెలువరించబడివుంది" అన్నది వినోదంగా చూస్తూ.

అతి ప్రయత్నంమీద తన ఆందోళనను బయటికి కనిపించకుండా అణుచుకున్నాడు షాడో. షీ యీజ్ డేంజరస్. తనను గురించి అంత యిదిగా తెలుసుకున్నదంటే.

షాడో భావాలను గమనించినట్లే చెప్పుకు పోతున్నది లీనా హోరూషీ.

"నేను సీక్రెట్ ఏజెన్సీలో చేరిన నాలుగవరోజున కంబాట్ క్లాసెస్‌కి అటెండ్ అయ్యాను. కరాటే, జూడో మొదలైన మార్షల్ ఆర్ట్స్ లో మమ్మల్నీ జపనీస్‌ని మించినవాళ్ళు ఎవరూ లేరని నా అభిప్రాయం. కానీ కరాటే క్లాసులు నడిచే గదిలో నీ

ఫోటోవున్నది. షాడో వుపయోగించే టెక్నిక్స్ అంటూ ప్రత్యేకమైన శిక్షణ యిస్తున్నారు మా కరాటే మాస్టర్. నువ్వు దాగర్‌ని ప్రయోగించే పద్ధతిని అనుసరించాలని స్పోర్ట్ ఆపరేటర్స్ అందరూ తలక్రిందులుగా తపస్సు చేస్తున్నారు...."

ఆపైన ఆమె ఏం మాట్లాడుతున్నదీ అర్థం కాలేదు షాడోకు. విన్నకొద్దీ వంటిమీద చీమలు పాములు ప్రాకినట్లు అనుభూతి కలుగుతోంది. విల్ పవర్ నంతా కూడగట్టుకొని కళ్ళుమూసుకున్నాడు. క్షణాలమీద అతన్ని ఆవహించుకొంది నిద్రాదేవత. నిద్రలో వుండగా లీనా మాట్లాడే మాటలు వినిపించే ఆస్కారం లేదు. ఆ మాటలు వినకపోతే తను యిలా బెదిరిపోవాల్సిన అవసరం లేదు.

పావుగంట తరువాత గాని ఆ విషయాన్ని గమనించలేదు. లీనా, ఒక్కక్షణం పాటు ఎంతో బాధకు లోనైంది ఆమె హృదయం.

"వెల్ మిస్టర్ షాడో...... అప్పుడే ఏముంది? ముందుంది ముసళ్ళ పండగ...." అనుకుంటూ సీటువెనక్కి చేరగలబడి

కళ్ళు మూసుకుంది తనుగూడా.

వారిద్దరి భావాలతో పనిలేనట్లు తన మానాన తను గమ్యస్థానం వైపు ప్రయాణం చేస్తూనేవుంది ఆ డబుల్ యింజన్ డకోటా విమానం.

***********************

చీకటి పడుతున్న సమయంలో సిక్కిం సరిహద్దులకు కొంచెం అవతలగావున్న మిలటరీ ఎయిర్ పోర్ట్ లో లాండ్ అయింది విమానం. రన్‌వే నిండా మంచు పేరుకొని వుండటం వల్ల ఎగిరెగిరి పడుతూపోయి ఒక పెద్ద చెక్కల మేడ ముందు ఆగింది. ఆ కుదుపులకు నిద్రాభంగమై కళ్ళు తెరచాడు షాడో.

అప్పటికే రెడీ అయింది లీనా. నవ్వుతూ షాడో చేయి పట్టుకుని సీట్లోనుంచి పైకిలేపింది. క్రిందపెట్టిన ఎయిర్ బాగ్ ని భుజానవేసుకొని ఆమెను అనుసరించాడు షాడో.

"వెల్ కమ్ టు అవర్ మిలటరీ కాంప్..." అంటూ ఎదురు వచ్చారు యిద్దరు మిలటరీ అధికారులు.

"హల్లో మిస్! మాక్యాంప్ లో అడుగుపెట్టిన మొట్టమొదటి లేడీ మీరే సుమా!" అంటూ సాదరంగా ఆహ్వానించారు లీనాను. వంటిమీద పడుతున్న మంచు తుంపరలను విదిలించివేస్తూ, చుట్టూ చూశాడు షాడో. ఎటుచూసినా తెల్లటి మంచుదిబ్బలే దర్శన మిస్తున్నాయి. సముద్రమట్టానికి దగ్గిరిగా ఎనిమిదివేల అడుగుల ఎత్తులో వుంటుంది ఆ ప్రదేశం. సంవత్సరమంతా మంచుతోనే నిండివుంటుంది.

"మీకు మా మెస్ హల్లో విడిది ఏర్పాటుచేశాం సర్. రేపు సాయంత్రం నాలుగు గంటలకు మన సరిహద్దులు దాటిస్తాం...."షాడోను మెస్ హాలు వైపు తీసుకుపోతూ అన్నాడు ఒక అధికారి.

లీనాకు చెక్కమేడలోవున్న ఒక ప్రత్యేకమైన గది యివ్వబడింది.

మిలటరీ అధికారి అందించిన రమ్ బాటిల్ ని వళ్ళో పెట్టకొని మెస్ హాలు మధ్యనవున్న నెగడుముందు పీఠంవేశాడు షాడో.

సూర్యడు పడమటి దిక్కుకు మరలుతుండగా

ప్రారంభించబడింది ప్రయాణం. సరిహద్దు సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన ఒక జీప్ లో బయలుదేరారు షాడో, లీనా హోరూషీ. ఇద్దరు సైనికాధికారులు నలుగురు సిపాయిలు వారిని అనుసరించారు.

ఎనిమిది గంటలవేలకు ఒక మంచుదిబ్బను చేరుకొని ఆగిపోయింది జీప్. అక్కడితో ఇండియా భూభాగం అంతమైపోతుంది. మంచుదిబ్బ అవతలినుంచి చైనీయుల సరిహద్దు ప్రారంభం అవుతుంది.

ఎయిర్ బాగ్‌ని భుజం మీద వేసుకొని జీప్‌లో నుండి క్రిందికిదూకాడు షాడో. దూదిపింజెలు పడుతున్నట్లు రాలుతున్నది మంచు. చలికి శరీరమంతా కత్తులతో కోసి వుప్పు కారం అద్దినట్లు వపరీతమైన బాధ కలుగుతోంది.

జీప్‌ని అక్కడే వదిలి దిబ్బమీదికి దారితీశారు సైనికాధికారులు. మంచుదిబ్బను ఆనుకొని పెద్ద అగాధం ఒకటి వుంది. ఆ అగాధాన్ని దాటేటందుకు ఒక సన్నపాటి తాటి నిచ్చెన అమర్చివుంది. తాటినిచ్చెన అవతలివైపు నిలబడివున్నారు పదిమంది చైనీస్ సైనికులు.

వారిని చూడగానే ఎందుకో అర్థంలేకుండా జలదరించింది షాడో శరీరం. "మిస్ లీనా.....గుడ్ బై! విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్!" అంటూ లీనాతో కరచాలనం చేశారు. ఇండియన్ మిలటరీ అధికారులు. ఆ మాటలతో తెలివి తెచ్చుకున్నాడు షాడో.

తాటి వంతెన మీద అడుగులు వేయసాగింది లీనా. ఆమె బరువుకు పెద్దగాలి వచ్చినట్లు అటూ యిటూ వూగిపోతుంది.

పది అడుగులు ముందుకువచ్చి లీనాకు చేయి అందించిసాయం చేశాడు చైనీయుల కాప్టెన్. షాడోకి సైగ చేసి ఆవలిప్రక్కనవున్న ఒక మంచుదిబ్బవైపు బయలుదేరిందామె.

అగాధంలోకి చూడకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తూ, తాటివంతెన మీద కాలుపెట్టాడు షాడో. లీనా బరువుకి అది అల్లల్లాడి పోయింది. షాడో పాదం పడేసరికి అసలు తెగిపోతుందేమో అనిపించేటంత క్రిందికి వంగింది.

ఊపిరి బిగపట్టి ముందుకు అడుగువేశాడు షాడో. దృష్టినంతా ఆవలివడ్డున వున్న చైనీయులమీదే

కేంద్రీకరించాడు.

రాతిబొమ్మల్లా నిలబడి వింత చూస్తున్నారు వారు. ఆవలివడ్డును సమీపించాడు షాడో. వడ్డు యింకో పదిఅడుగులు దూరంలో ఉందనగా...... రక్తాన్ని గడ్డకట్టించే ఒక గాలితెర అగాధం మీదుగా దూసుకువచ్చింది. గాలి పటానికి కట్టిన దారం మాదిరి పక్కకు వంగింది తాటినిచ్చెన. పట్టుజారి బోర్లాపడ్డాడు షాడో. మంచుతో తడిసి వున్న ఆ త్రాళ్ళు పిడికిట్లో నిలవటంలేదు. ఏ క్షణంలోనైనా పట్టు సడలిపోవచ్చు.

రెండువేల అడుగుల లోతువున్నదా అగాధం!! పడితే మరి ఎముకలుకూడా కనిపించక పోవచ్చు !!

ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు చైనీయులు. ముఖాలలో ఎటువంటి భావాలను చూపకుండా శిలావిగ్రహాల్లా అలాగే నిలబడి చూస్తున్నారు.

పళ్ళు బిగువున ముందుకు పాకాడు షాడో. ఆవలివడ్డున వున్న ఇనుపకొక్కీలను పట్టుకొని మెల్లిగాలేచి నిలబడ్డాడు. ఆగ్రహం అతని శరీరాన్ని ఆక్రమించుకోవటం ప్రారంభించింది. అప్రయత్నంగా బిగుసుకున్నాయి పిడికిళ్ళు.

అంతలోనే వివేకం అతన్ని వెన్నుతట్టి హెచ్చరించింది. ఆ సమయంలో ఏమాత్రం గోల అయినా అది ఒక పెద్ద ఇంటర్నేషనల్ సీన్‌గా మారి తీరుతుంది. తమ రిప్రజెంటేటివ్‌ని అవమానించారని ఇండియన్ ప్రభుత్వం చైనామీద కినుక వహించాల్సి వస్తుంది.

అతి ప్రయత్నంమీద తనను తాను కంట్రోల్ చేసుకొని వెనక్కి చూశాడు షాడో. చేతులు వూపారు ఇండియన్స్. వారి బాధ్యత అంతటితో తీరిపోయింది. కామ్‌గా దిబ్బమీద నుంచి దిగి తమ కాంప్‌కి వెళ్ళిపోయారు.

శత్రువుల మధ్య వంటరిగా మిగిలిపోయాడు షాడో. త్రాటి వంతెనకు వందగజాల దూరంలో రెండు చైనీస్ జీప్స్ నిలబడివున్నాయి. వాటిదగ్గర నిలబడివుంది లీనా. అరవైసంవత్సరాల వయస్సువున్న ఒక వృద్ధ చైనీయుడుతో మాట్లాడుతూ షాడో కోసం వెయిట్ చేస్తుంది.

"రాజూ! హి ఈజ్ మిస్టర్ అషీబా. మంచు మైదానాలను గురించి మనకు తెలియచేసేది ఈయనే" అంటూ అతన్ని షాడోకు పరిచయం చేసింది.

"మిస్టర్ షాడో! నిన్ను కలుసుకోవటం నాకు ఎంతో సంతోషాన్ని కలుగచేస్తోంది" అంటూ కరచాలనం చేశాడు అషీబా.

షాడో మనస్సు తాటివంతెన ఇన్సిడెంటుని గురించి ఆలోచిస్తుంది. ఒక్కఅడుగు ముందుకువేసి తనకు హెల్ప్ చేయవచ్చు. ఆపని చేయకుండా ఏమౌతుందో చూద్దామన్నట్లు నిలబడిపోయారు వాళ్ళు. ఎందుకని?

"ఈ చలిగాలిలో నిలబడటంకంటె మనం కాంప్‌కి వెళ్ళి మాట్లాడుకోవటం చాలా మంచిది కమాన్ మిస్టర్ షాడో లెటజ్ గో" అంటూ జీప్‌లో కూర్చున్నాడు అషీబా.

లీనా షాడోలు కూడా ఆయన ప్రక్కనే కూర్చున్నారు వెంటనే పక్కకు తిరిగి మంచులో పరుగులు తీయటం ప్రారంభించింది. రెండవ జీప్ వంద అడుగులు వెనుకగా వారిని అనుసరించడం ప్రారంభించింది. అందులో మెషిన్ గన్స్ పట్టుకొని కూర్చున్న సైనికుల్ని చూడగానే కనుబొమ్మలు ముడివేశాడు షాడో.

"వాళ్ళు మనకు రక్షణ కల్పించటానికి వస్తున్నారు రాజూ!" అతని ఆలోచనల్ని కొంత వరకూ అర్థం చేసుకొన్న లీనా మృదువుగా నవ్వుతూ వివరించి చెప్పింది.

"రక్షణ కల్పించటానికా లేక నేను తప్పించుకొని పారిపోకుండా కాపలాకాయటానికా?" ఎంత వద్దని అనుకున్నా ఆగకుండా షాడో నోటివెంట వచ్చేసింది ఆమాట.

ఉలిక్కిపడి అతనిముఖంలోకి చూసింది లీనా.

"రాజూ! ఏంజరిగింది? ఎందుకలా కోపంగా మాట్లాడుతున్నావ్? మా సైనికులేమైనా కామెంట్స్ చేశారా? చేసివుంటే చెప్పు నా పై అధికారులకు రిపోర్ట్ చేసి వాళ్ళ అంతుచూస్తాను" అన్నది ఆత్రుతనిండిన కంఠంతో."

"నథింగ్. ఫర్ గెటిట్....." అన్నాడు షాడో.

ఏదో అనబోయింది లీనా. ఆమె నోరు తెరువకముందే ఒక పెద్ద భవనముందు సడన్ బ్రేకుతో ఆగింది వారి జీప్. ఏడు అడుగుల ఎత్తున్న ప్రహరీగోడ ఆ ప్రహరీ వెనుక పెద్ద మైదానం,

ఆ మైదానం మధ్యలో వున్నది ఆ చెక్కల భవనం. తెల్లగా మిలమిల మెరిసిపోతున్నది.

జీప్ ఆగటాన్ని గమనించి పెద్ద ఇనుపగేటును తెరిచారు అక్కడవున్న సైనికులు. జీప్ లోపలికి పోగానే గేటుమూసి కాపలా నిలబడ్డారు.

అనుమతిలేకుండా ఆ కాంపౌండ్ ని దాటి బయటికిపోవటం అసాధ్యం అని గ్రహించటానికి షాడో ఎంతోసేపు ఆలోచించాల్సిన అవసరం లేకపోయింది. ప్రతి పది నిముషాల కొకసారి కాంపౌండ్ వాల్ చుట్టూ రౌండ్స్ కొడుతున్నారు పదిమంది సైనికులు. తెల్లగా పిండిఆరబోసినట్లున్న ఆ మంచు మైదానంలో ఏమాత్రం కదలిక కనిపించినా వారికి తెలిసిపోతుంది.

"ఈరోజుకు రెస్ట్ తీసుకోండి.... ట్రెయినింగ్ రేపటినుంచి ప్రారంభం అవుతుంది" అంటూ షాడోని చెక్కల మేడను ఆనుకొనివున్న ఒక గెస్ట్ కాబిన్‌లో వదిలాడు అఫ్షిబా. లీనాను వెంటబెట్టుకొని మేడలోకి వెళ్ళిపోయాడు.

షాడో కోసం ఎలాట్ చేసిన ఆగెస్ట్ కాబిన్ చాలా విశాలంగా

వుంది. కాబిన్ చివర పెద్ద ఫైర్ ప్లేస్ కనిపిస్తోంది. చిటపటలాడుతూ వున్నాయి అందులోని దుంగలు. వాటి మంటలు గదినంతా వెచ్చగా తయారుచేస్తున్నాయి. ఆమంటకు నాలుగు అడుగులు యివతలగా ఒక బెడ్ అమర్చివుంది.

ఎయిర్ బాగ్‌ని మంచంక్రిందికి నెట్టి బెడ్ మీద మేనువాల్చాడు షాడో. ఆలోచనలతో అలసివున్న అతని అంతరంగం విశ్రాంతిని కోరింది. నిద్ర దానంతట అదే వచ్చేసింది.

చల్లటి గాలితెర ముఖంమీదికి రావటంతో వులిక్కిపడి కళ్ళు తెరిచాడు షాడో. కన్ను పొడుచుకున్నా కానరాని అంధకారం ఆవరించుకొనివుంది ఆ కాబిన్‌ని. ఫైర్‌ప్లేస్‌లో వున్న దుంగలు చల్లారిపోయాయి.

ఇనుపపెట్టెలా వున్న ఆ గదిలోకి చలిగాలి రావటానికి అవకాశం లేదు. మంటలు చల్లారిపోతే గదిలోని టెంపరేచర్ గ్రాడ్యువల్‌గా తగ్గిపోవాలి. గాలి తెరలు రాకూడదు. ఎవరైనా తలుపులు తెరిస్తే తప్ప

చీకటికి అలవాటుపడిన షాడో నేత్రాలు అంగుళం అంగుళం చొప్పున తెరుచుకుంటున్న కాబిన్ ద్వారాన్ని గమనించే సరికి ఆ ఆలోచన అలాగే కట్ అయిపోయింది. తలుపులు మూసి లోపలివైపు బోల్టు బిగించకుండా వదిలేసినందుకు తనను తనే నిందించుకుంటూ, వూపిరి బిగపట్టి చూశాడు.

నిశ్శబ్దంగా లోపలికి వచ్చి తలుపులు మూశాడు ఒక చైనీయుడు. మడిచిపెట్టిన యినుప స్ప్రింగుల్లా బిగుసుకున్నాయి షాడో అవయవాలు. అతనిచేతుల్లో ఏదో ఒక ఆయుధం వుంది. ఏమిటది ? రివాల్వరా?

అడుగులో అడుగువేస్తూ మంచందగ్గరికి వచ్చాడావ్యక్తి. నాలుగడుగులు వేయగానే అతని చేతిలో ఆయుధం కొట్టవచ్చినట్లు కనిపించింది షాడో కళ్ళకు.

ఎనిమిదంగుళాల పొడవున్న వేటకత్తి అది. నిశ్శబ్దంగా పనిపూర్తిచేయాలని నిర్ణయించుకున్నారన్న మాట!!

మంచం ప్రక్కన నిలబడి కత్తిని గాలిలోకి ఎత్తాడా చైనీయుడు.

ఉన్నట్లుండి అవతలకు దొర్లాడు షాడో. మంచం మీదినుంచి క్రిందపడిన మరుక్షణం నేలకు కొట్టిన రబ్బరు బంతిలా పైకి లేచి నిలబడ్డాడు. లేస్తూనే గాలిలోకి డైవ్ చేసి ఆవ్యక్తి గుండెల మీద బలంగా పొడిచాడు తలతో.

"అబ్బా!" అంటూ వెనక్కి తూలాడతను.

కాళ్ళు నేలను ఆనుకొన్న మరుక్షణం కుడి చేతిని ముందుకు జాచాడు షాడో. కత్తిని పట్టుకున్న ఆ వ్యక్తి చేతిని అవతలకు నెట్టి ఎడమచేత్తో అతని గుండెల మీద చరిచాడు.

కన్ను మూసి కన్ను తెరిచేటంతలో జరిగిపోయిందది. ఎదురుచూడని ఆపరిణామాన్ని వెంటనే డైజస్ట్ చేసుకోలేకపోయిందా చైనీయుడి హృదయం.

షాడో చరిచిన చరుపుకు మరో రెండడుగులు వెనక్కి పోయాడు. మరు సెకనులో మెరుపుకంటే వేగంగా లేచింది షాడో కాలు.

ఫట్ మని శబ్దం చేసింది ఆవ్యక్తి భుజపు టెముక. బాధతో బిగ్గరగా అరిచాడతను. కత్తిని నేలకు వదిలి

ముందుకుతూలాడు.

అతని జుట్టు పట్టుకొని ఒక్కసారిగా గాలిలోకి ఎత్తాడు షాడో. రెండుసార్లు అటూ ఇటూ వూపి కాబిన్ ద్వారం వైపు విసిరేశాడు.

ఇసుకమూటలా పోయి ద్వారాన్ని గుద్దుకున్నాడతను. మరోసారి అరిచి అలాగే తల వాల్చేశాడు.

"ఏమిటి? ఏమయింది? ఏమయింది?" అని అరుస్తూ దబదబ తలుపులు తట్టారు ఎవరో.

కామ్‌గా పోయి ఎలక్ట్రిక్ స్విచ్‌ని నొక్కాడు షాడో. పట్టపగలుగా మారింది ఆ గది. ఆవెలుగులో వుడ్ బీ కిల్లర్ ముఖాన్ని చూసి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు.

తాటివంతెన దగ్గర తనకు రిసెప్షన్ యిచ్చిన చైనీస్ కాప్టన్ అతను!!!

*****************************

"రాజూ! నీకేం దెబ్బ తగలలేదు గదా!... థాంక్ హెవెన్స్!! అంటూ వచ్చి షాడో చేయి పట్టుకుంది లీనా.

"ఎవరితను? ఎందుకు వచ్చాడిక్కడికి?" ఇసుక మూటలా పడివున్న కాప్టన్‌ని చూస్తూ అడిగాడు అష్బా నిద్రమత్తు వదలని కంఠంతో.

అతన్నీ, లీనాను పిల్చుకు వచ్చిన సెక్యూరిటీ గార్డులు యిద్దరూ గది బయట నిలబడి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు.

"అతనెవరో నాకు తెలియదు. అతను తీసుకువచ్చిన కత్తి మాత్రం క్లియర్ గా కనిపించింది..."అంటూ క్రిందపడిన కత్తిని తీసి అష్బాకు అందించాడు షాడో.

అదిరిపోయాడు అష్బా. "నిన్ను చంపటానికి వచ్చాడా? నేను నమ్మలేను. కట్టుదిట్టమైన యింత కాపలా వుండగా అతను అసలు లోనికి ఎలా రాగలిగాడు....."అన్నాడు షాడో అందించిన కత్తిని చూస్తూ.

"ఏలా వచ్చాడో మీకు తెలుసు. మీ సెక్యూరిటీ గార్డులకు తెలుసు. తెలియనట్లు నటించకండి. చాలా సిల్లీగా వుంటుంది." రైజ్ అవుతున్న కోపాన్ని అదిమి పట్టుకుంటూ అన్నాడు షాడో.

"రాజూ! రాజూ! ప్లీజ్!!!" అంటూ అతని ముఖాన్ని తనవైపు తిప్పుకుంది లీనా.

ఆమె చేతుల్ని విసిరి కొట్టాడు షాడో.

"చైనాకు రావటం నాకు యిష్టం లేదు. ఇష్టం లేకపోయినా నా ప్రభుత్వపు ఆదేశాలను శిరసావహించాలి కాబట్టి, మీతో పని చేయటానికి వప్పుకున్నాను... మిమ్మల్ని నమ్ముతున్నానని, మీ మధ్య వుండగా ఆదమరిచి నిద్రిస్తానని పొరబడకండి. ఈ క్షణం నుంచీ నా అనుమతి లేకుండా యీ గదిలోకి అడుగుపెట్టినవారు ప్రాణాలతో కాదు. ఆపని చేయాల్సింది. శవాకారంలో లోపలికి వస్తారు. ఎవరు ఏమిటి ఎందుకు? అన్న ప్రశ్నలను నేను అడగను. తలుపు మీద చెయ్యి పడిన మరుక్షణం షూట్ చేస్తాను." స్వచ్ఛమైన

చైనీస్ భాషలో తన భావాల్ని విపులపరిచి ఆషీబాకు వెల్లడి చేశాడు.

అషీబా గొంతులో ఏదో రాయి లాంటిది అడ్డం పడినట్లయింది. అతని నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది.

"మిస్టర్ షాడో! ప్లీజ్ ఫర్ గివ్ అజ్!! పొరపాటు జరిగింది. ఇక మీదట ఇటువంటి సంఘటనలు జరగవని నేను హామీయిస్తున్నాను." అన్నాడు.

"ఇప్పుడు నేను హామీలను స్వీకరించే పరిస్థితిలో లేను. తెల్లవారిన తర్వాత యివ్వండి...." అన్నాడు షాడో ద్వారం వైపు చూపిస్తూ.

ఏదో అనబోయి ఆఖరి క్షణంలో ఆగిపోయాడు అషీబా.క్రింద పడివున్న కాప్టెన్‌ని తీసుకుపొమ్మని సెక్యూరటీ గార్డులకు సైగ చేసి, తనుగూడా వారిని అనుసరించి వెళ్ళిపోయాడు.

"రాజూ! ఇతన్ని రాజధానికి పంపిస్తాము. ఇతని ఆగడానికి తగిన శిక్ష విధింపబడేటట్లు చూస్తాం....." షాడోతో వంటరిగా

మిగిలిపోయిన లీనా సంభాషణకు వుపక్రమించింది మెల్లిగా.

"నాకు తెలుసు.... అతనికి విధించబడే శిక్ష ఎలా వుంటుందో వూహించగలను....." సిగరెట్ పాకెట్‌ని అందుకుంటూ అన్నాడు షాడో.

"నా మాటల మీద నమ్మకం లేదా?....రాజూ! అతనికి ఎటువంటి శిక్ష విధించాలో నువ్వే చెప్పు. అక్షరాలా దాన్ని అమలులో పెట్టిస్తాను."

"మాటలతో కాలం గడపటం నాకు అలవాటు లేదు బేబీ గుడ్ నైట్!!" అంటూ మంచం మీద మేను వాల్చాడు షాడో.

తెల్లబోయింది లీనా. తల విదిలిస్తూ బయటకి వెళ్ళిపోయింది. వెంటనే లేచి బోల్టు బిగించాడు షాడో. ఎందుకైనా మంచిదని ఒక కుర్చీని తలుపుకు అడ్డం వేసి మంచం ఎక్కాడు.

******************

మర్నాడు ఉదయం ఎనిమిది గంటలకు ట్రైనింగ్ క్లాసెస్ ప్రారంభం అయినాయి.

"మిస్టర్ షాడో....నా అపాలజీని స్వీకరిస్తావని ఆశిస్తున్నాను. మా మీద నీకు చెడు అభిప్రాయం ఏర్పడిందని నాకు తెలుసు. బట్ ఐ డీప్లీ! రిగ్రెట్ ది **లాస్ట్** నైట్ ఇన్సిడెంట్...." అన్నాడు అషీబా క్లాసును ప్రారంభిస్తూ.

మౌనంగా తల వూపాడు షాడో. జరిగినదేదో జరిగిపోయింది. ఇకదాని గురించి తలలు పట్టుకోవటం అనవసరం.

చెక్కల మేడ వెనుక ప్రక్క వున్న మంచు మైదానంలో షాడో, లీనాలకు ప్రత్యేకమైన శిక్షణ యివ్వటం ప్రారంభించాడు అషీబా.

మంచులో ఎలా నడవాలి అన్న అంశంతో ప్రారంభం అయింది అది. మధ్యాహ్న సమయానికి మంచు తుఫానులు వస్తే ప్రాణాలు కాపాడుకోవటం ఎలా అన్న అంశాన్ని టేకప్ చేశాడు అషీబా. ఎస్కిమోలు నిర్మించుకునే మంచు

గుహలు(ఇగ్లూలు) ఎలా వుంటాయి, వాటిని కట్టటం ఎలా అన్న విషయాల్ని వివరించి చెప్పాడు. చీకటి పడుతుండగా ఎండ్ అయింది ఆరోజు క్లాసు.

ఆ రాత్రి రివాల్వర్‌ని తలగడ క్రింద పెట్టి పడుకున్నాడు షాడో. తెల్లవారుతుండగా తలుపులు తట్టిన శబ్దం వినవచ్చింది.

"రాజూ! క్లాసుకు టైం అయింది..." అంటూ వినవచ్చింది లీనా కంఠస్వరం.

గబగబా లేచి వాష్ బేసిన్ దగ్గరకి పోయాడు షాడో. టాప్‌లో నుంచి వస్తున్న వేడినిళ్ళతో ముఖం కడుక్కొని డ్రస్ ఛేంజి చేసుకున్నాడు.

"గుడ్ మార్నింగ్!" అంటూ విష్ చేసింది లీనా తలుపు తెరిచి బయటకు అడుగు పెట్టగానే.

చిన్న దరహాసం ఒకటి ప్రత్యక్షమై వెంటనే మాయమై పోయింది షాడో పెదవుల మీద. అతన్ని కాంటీన్‌కి తీసుకుపోయింది లీనా. టిఫెన్ కాఫీలు అయిన తర్వాత చెక్కల మేడలోని ఒక పెద్ద గదికి దారి తీసింది.

పెద్ద పెద్ద మాప్స్ ముందు పెట్టుకొని వారి కోసం ఎదురు చూస్తున్నాడు అషీబా. హిమాలయ పర్వత శ్రేణులన్నీ ఆ మాప్స్‌లో వివరంగా మార్క్ చేయబడి వున్నాయి.

దేశ బహిష్కరణ శిక్ష విధించబడ్డ సైంటిస్టులు లేబరేటరీని నిర్మించుకోవటానికి అవకాశాలు ఎక్కడ వున్నాయి అన్న అంశం మీద చర్చ ప్రారంభం అయింది. సిగిరెట్ మీద సిగిరెట్ కాలుస్తూ మౌనంగా ఆ మాటలన్నీ విన్నాడు షాడో. ఆయుధాలు, ఆహరపదార్థాలు లేకుండా మంచులో జీవించాలంటే ఏం చెయ్యాలి? అన్న పర్టిక్యులర్స్ ని అషీబా వివరిస్తుంటే జాగ్రత్తగా విని నోట్ చేసుకున్నాడు.

ఆరోజు కూడా చీకటి పడేదాకా లెక్చర్ యిస్తూనే వున్నాడు అషీబా. చీకటి పడగానే తన గదికి తిరిగి వచ్చాడు షాడో. మరో విషయాన్ని గురించి ఆలోచించకుండా డోర్‌ని లాక్ చేసి ముసుగు బిగించాడు.

ఎందుకో మెలుకువ వచ్చింది ఒక రాత్రి వేళ. లేచి వాచి వంక చూశాడు. రాత్రి రెండు గంటల్ని సూచిస్తోంది అది. తలగడ క్రింద ముఖం దాచుకొని నిద్రపోవటానికి ప్రయత్నించాడు. నిద్ర

రాలేదు.

మంచానికి ఒక చివరగా పడవేసిన వున్ని కోటును అందుకుంటూ లేచి, కాబిన్ బయటికి వెళ్ళాడు. చల్లటి గాలి తగిలేసరికి, మనస్సును ఆవరించుకొని వున్న అర్థం లేని ఆందోళన ఛ్ఛాయలు మాసి పోయాయి.

ప్రహరీబయట రౌండ్స్ కొడుతున్న సెంట్రీలను చూస్తూ ఒక అరగంట సేపు కాబిన్ ముందు పచార్లు చేసేసరికి నిద్ర వస్తున్న లక్షణాలు కనిపించటం ప్రారంభించాయి. నోట్లో వున్న సిగిరెట్ ని క్రింద పడేసి కాబిన్వైపు తిరుగుతుండగా చెక్కల మేడ రెండవ అంతస్థులో ఒక లైటు వెలిగింది.

అప్రయత్నంగా జంప్ చేసి కాబిన్ గోడను అతుక్కుపోయాడు షాడో. ఎందుకలా చేశాడో అతనికే అర్థం కాలేదు. రెండు నిముషాలు గడిచాయి. మూడవ నిముషం పూర్తి కాబోతుండగా ఒక జీప్ వచ్చి ప్రహరీ గేటు ముందు ఆగింది. బరువైన వున్ని దుస్తులు ధరించిన ఒక ఆకారం సెంట్రీలతో ఏదో మాట్లాడి గేటు దాటి చెక్కల మేడవైపు వచ్చింది.

రెడవ అంతస్థు బాల్కనీలో ప్రత్యక్షమైంది లీనా. ఆమెను చూడగానే చేతులు వూపి విష్ చేసిందా ఆకారం. గబగబా అడుగులు వేసి మెట్లు ఎక్కింది.

కుతూహలాన్ని అణుచుకోవటం షాడోకు అసాధ్యమై పోయింది. కాబిన్ తలుపుల్ని దగ్గరికి లాగి మెట్ల వైపు బయలుదేరాడు. ప్రహరీ బైట వున్న సెంట్రీలకు కనిపించకుండా మేడ గోడలను చాటు చేసుకొని మెట్ల మీద అడుగు పెట్టాడు.

లైట్లు వెలుగుతున్న గది తలుపులు ఓరగా తెరిచి వున్నాయి. జీప్‌లో వచ్చిన వున్ని దుస్తుల ఆకారం నెగడు ముందు నిలబడి చలి కాచుకుంటున్నది. ఒక కుషన్ ఛైర్‌లో కూర్చుని సీరియస్‌గా చూస్తోంది లీనా.

పిల్లిలా పోయి గదికి నాలుగు అడుగుల దూరంలో మోకరించి కూర్చున్నాడు షాడో.

"... ఏది ఏమైనా యింత ఆలస్యం జరగటం ఏమీ బాగో లేదు లీనా! మన వాళ్ళు చాలా ఆత్రుత పడుతున్నారు. ఈ ఆలస్యానికి కారణం ఏమిటో తెలుసుకోవాలని

అనుకుంటున్నారు." ఉన్ని కోటును తీసి ఒక కుర్చీ మీద వేస్తూ అన్నది ఆకారం.

"కారణం కావాలంటే నన్ను పిలిపించి అడగాల్సింది. ఆ కాప్టెన్‌ని ఎందుకు పంపించారు? బయలు దేరిన క్షణం నుంచీ అదోలా వున్నాడు ఆ షాడో. కాప్టెన్ మూలకంగా అసలు అతన్ని మాటాడించటానికే వీలు లేకుండా వుంది."

కోపంగా సమాధానం యిస్తోంది లీనా.

"మన మధ్యలోకి వచ్చిన మనిషిని ఎంత త్వరగా వీలైతే అంత తొందరగా అడ్డు తొలగించుకోవాలని ఆలోచించారు మనవాళ్ళు. కాప్టెన్ అంత తేలిగ్గా దెబ్బ తింటాడని మనవాళ్ళు వూహించలేదు. మరి నీ విషయం ఏమిటి?" మంచం మీద కూర్చుంటూ అడిగిందా ఆకారం.

"రెండు సంవత్సరాల పాటు ట్రైనింగ్ యివ్వబడింది నాకు. షాడోని ఎలా చంపాలి అన్న విషయాన్ని గురించి నేను ఆలోచించినంత తీవ్రంగా మరెవ్వరూ ఆలోచించి వుండరు. చంప శక్యం కాని సీక్రెట్ ఏజెంట్ షాడో నా చేతినుంచి

తప్పించుకుపోలేడు. అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను. షాడో ఏమరిపాటుగా వున్న మరుక్షణం హతం చేసేస్తాను." గంభీరంగ వినవచ్చింది లీనా కంఠస్వరం.

"ఇన్ని రోజులనుంచీ అతనితో తిరుగుతున్నావ్ అవకాశం అనేది అసలు కనిపించలేదా? "

"గాఢ నిద్రలో వుండగా చంపమని పంపించారు ఆ కాప్టెన్‌ని. అతను వస్తున్నట్లు షాడోకి ఎలా తెలిసింది? అతనికి పట్టిన గతిని చూస్తే నీకు అర్థం అయివుండేది. ఆ షాడో సామాన్యుడని అనుకోబోకు. అవసరం రానంత వరకే అతను మనిషి. ఎదురు తిరగటం ప్రారంభిస్తే అతని ముందు నిలబడటం చాలా కష్టం. బల ప్రయోగంతో అతన్నిఏమీ చెయ్యలేము. సందు చూసుకొని మైమరపిస్తాను..." అంటున్నది లీనా.

ఆపైన ఆమె మాటల్ని వినలేకపోయాడు షాడో... మెల్లిగా వెనక్కి జరిగి మెట్లు దిగాడు.

ప్రహరీ చుట్టూ వున్న బందోబస్తును చూడగానే అతని శరీరం మీద రోమాలన్నీ కత్తుల్లా నిక్కబొడుచుకున్నాయి.

బోనులో బిగించేశారు తనను. బయటపడటం అనేది అవుటాఫ్ క్వశ్చన్!! సెంట్రీలకు కనిపించకుండా తన కాబిన్‌కి తిరిగివచ్చి నెగడు ముందున్న కుర్చీలో కూర్చున్నాడు. పనామా వెలిగించుకొని, పైకి పోతున్న పొగను చూస్తూ, ఏవేవో ఆలోచనల్లో మునిగిపోయాడు.

*************************

"మిస్టర్ షాడో! మీకు చెప్పవలసిన విషయాలన్నీ చెప్పేశాను. ఇంకో రెండు గంటల్లో మిమ్మల్ని ప్రయాణానికి సిద్ధం చేయమని నాకు ఆర్డర్స్ వచ్చాయి. నీకు సమ్మతమేనా?" నవ్వుతూ ప్రశ్నించాడు అషీబా.

అతను చెప్పిన పాఠాలన్నిటినీ ఒకసారి మననం చేసుకుంటున్న షాడో మౌనంగా తల వూపాడు.

"వెరీగుడ్! మీతో వచ్చేటందుకు ఒక గైడ్‌ని ఏర్పాటు చేసింది మా ప్రభుత్వం. అతన్ని పరిచయం చేస్తాను." అంటూ టేబిల్ మీది కాలింగ్ బెల్‌ని నొక్కాడు అషీబా.

వెంటనే అవతలి గదిలో అడుగుల శబ్దం వినవచ్చింది. లావుగా, పొట్టిగా వున్న ఒక టిబెట్ దేశస్థుడు క్లాస్ రూమ్ లోకి వచ్చాడు.

"మిస్టర్ షాడో! మీట్ యువర్ గైడ్. పేరు యూబా!" అంటూ పరిచయం చేశాడు అషీబా.

"హౌ డూ యూ డూ, మిస్టర్ షాడో!" అన్నాడు యూబా. ఉలికిపాటును అతి నేర్పుగా కప్పి పుచ్చుకొని తల వూపాడు షాడో.

చైనీస్ అధికారులకు లీనా మీద నమ్మకం తగ్గిపోయిందా? లేక ఆమెకు హెల్ప్ చేయడానికి పంపబడ్డాడా యీ యూబా!!

గత రాత్రి లీనా తో మాట్లాడిన ఆకారమే అతను... నిష్కల్మషంగా నవ్వుతూ షాడోతో కరచాలనం చేశాడు.

**********************

నామ్‌సో సరస్సు మీదుగా ఎగురుతున్నది చైనీస్ రవాణా విమానం. పెద్ద పెద్ద మంచుగడ్డలతో నిండివున్నదా సరస్సు పట్టి

పట్టి చూస్తే తప్ప దానికి మిగిలివున్న మంచు మైదానాలకీ డిఫరెన్సు తెలియటం లేదు.

నామ్‌సో సరస్సు దగ్గిర్నించి పరశోధన ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు షాడో. లీనాలు, అష్రీబా కూడా అదే మంచిపని అని తీర్మానించారు.

పనామా పొగల్ని రింగులు రింగులుగా వదులుతూ అష్రీబా గురించి ఆలోచించటం ప్రారంభించాడు షాడో. తనకు పట్టబోతున్న గతి ఏమిటో అతనికి తెలుసా? ఏది ఏమైనా అష్రీబా దగ్గర ట్రైనింగ్ తీసుకోవడం చాలా మంచిది అయింది. భవిష్యత్తులో తనకు వుపయోగిస్తాయి అతను చెప్పిన విషయాలు.

ముందు తను యిక్కడినుంచి ప్రాణాలతో బయటపడగలిగితే గదా భవిష్యత్తును గురించి ఆలోచించాల్సింది!!! ముందు సీట్లో కూర్చుని వున్న యూబాను చూస్తూ తన ఆలోచనలకు తనే నవ్వుకున్నాడు షాడో.

"ఏమిటి రాజూ నవ్వుతున్నావ్?" వెంటనే అడుగింది లీనా.

"నేను చిన్నప్పుడు చదువుకున్న కథ ఒకటి గుర్తుకు వచ్చింది...." కిటికీలోనుంచి బయటకు తొంగి చూస్తూ అన్నాడు షాడో.

ఆ కథ ఏమిటో తెలుసుకోవాలని కుతూహలపడింది లీనా. ఆమె కోరిక నెరవేరలేదు. నామ్‌సో సరస్సును దాటింది విమానం. కాబిన్‌లోంచి తల బయట పెట్టి" గెట్ రెడీ..." అంటూ హెచ్చరించాడు పైలెట్!

సీట్ల క్రింద వుంచిన పేరాచూట్స్‌ని భుజాలకు తగిలించుకుంటూ లేచి నిలబడ్డారు షాడో, లీనా, యూబా.

విమానం నామ్‌సో మంచు మైదానం మీద రౌండ్స్ కొట్టటం ప్రారంభించింది. ఉన్నట్లుండి దాని వెనుక భాగంలోవున్న తలుపు ఒకటి తెరుచుకున్నది.

కనుచివరల నుంచి యూబా వైపు చూశాడు షాడో. పేరాచూట్ బెల్టును నడుము చుట్టూ చుట్టుకోవటంలో బిజీగా

వున్నాడతను. లీనా కూడా అదే మాదిరి! ముందు దూకాల్సింది ఎవరు?

"రెడీయా?" పైలెట్ కాబిన్‌లోనుంచి వినవచ్చింది పైలెట్ కంఠం.

వెంటనే ఎగిరి గాలిలోకి డైవ్ చేశాడు షాడో. వెన్వెంటనే దూకింది లీనా. ఆమెను అనుసరించాడు యూబా.

షాడో తలకు పాతిక అడుగుల ఎత్తులో వున్నారు వారిద్దరూ. లీనా ఎదురుచూస్తున్న అవకాశం అదే! చిన్న రివాల్వర్‌ని బయటికి లాగితే చాలు

విమానంలోనుంచి దూకగానే పేరాచూట్‌ని వూడతీసే యినుపరింగును గట్టిగా గుంజారు వారిద్దరూ. గొడుగుల్లా తెరుచుకున్నాయి వారి పేరాచూట్లు.

అలా చేయలేదు షాడో. గాలిలో పల్టీలు కొడుతూ శరవేగంగా జారిపోయాడు భూమివైపు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో రివల్వర్ రేంజిని దాటి చాలా దూరం దిగిపోయాడు. నేల యింకో వెయ్యి అడుగుల దూరం వుందనగా మెల్లిగా

పారాచూట్ ని విడదీసే తాడును గుంజాడు.

బెలూన్‌లా గాలిలోకి లేచిందది. అతని పయన వేగాన్ని క్షణాల మీద తగ్గించి వేసింది. అయినా అతి వేగంగా ఎదురు వచ్చింది నేల. కాళ్ళను ముడిచి, కండరాలను బిగించి క్రింద పడ్డాడు.

ముప్ఫై సెకండ్ల తర్వాత క్రిందికి వచ్చారు లీనా, యూబాలు, అతని ముఖం కల్లు తాగిన కోతిలా తయారై వుడటాన్ని గమనించి, తను తీసుకున్న జాగ్రత్త తన ప్రాణాలను రక్షించిందని తెలుసుకున్నాడు షాడో. వారితోపాటు పేరాచూట్‌ని లాగివుంటే వారితో సరి సమానంగా గాలిలో తేలుతూ వుండేవాడు నీట్‌గా ఫినిష్ అయిపోయి వుండేవాడు.

పేరాచూట్లు సురక్షితంగా నేలకు దిగటాన్ని గమనించి కాన్వాస్ సంచులలో పాక్ చేసి వున్న ఎక్విప్ మెంట్స్‌ని క్రిందికి దొర్లించారు విమానంలో వున్న పైలెట్లు. వాటికి కూడా చిన్న చిన్న పారాచూట్లు తగిలించి వున్నాయి. అది గాలిలో తేలుతూ వుండటాన్ని గమనిస్తూ మేఘాలలోకి పోయి దృష్టిపథం

నుంచి మాయమై పోయింది విమానం.

దాని శబ్దం కూడా వినిపించకుండా పోయింది రెండు క్షణాల తరువాత.

వెంటనే యూబాకు సైగచేసి క్రిందపడిన ఎక్విప్ మెంట్ సంచుల్ని ఒకచోట చేర్చమని ఆదేశించాడు షాడో.

లీనా వంక చూశాడు యూబా.

"ఏమిటలా గుడ్లు మిటకరిస్తావ్? నేను చెప్పిన మాట అర్థం కాలేదా?" అడిగాడు షాడో.

"సామాన్లను మోయవలసిన అవసరం నాకు లేదు"

నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడతను.

రెండు అంగల్లో అతన్ని సమీపించాడు షాడో. పిడికిలి బిగించి బలంగా కొట్టాడు గడ్డం మీద. అంత లావు యూబా పల్టీకొట్టి నాలుగు అడుగుల దూరంలో పడ్డాడు.

"సామాన్లను మోయటానికి కాకపోతే ఎవర్ని

వుద్ధరించటానికి వచ్చావ్? చెప్పిన పని చేయకపోతే కాళ్ళుచేతులు విరిచి నామ్‌సో సరస్సులో పడేస్తాను జాగ్రత్త!!" కరకరలాడుతున్న కంఠంతో హెచ్చరించాడు షాడో.

"మాటలతో చెప్పొచ్చుగదా? చేయిచేసుకోవాల్సిన అవసరం ఏముంది?" ఎర్రబడిన ముఖంతో అన్నది లీనా.

"ఒక్క చెయ్యి మాత్రమే చేసుకున్నాను. రెండు చేతుల్ని చేసుకున్నట్లయితే మీ యూబా యీపాటికి దేవకన్యల గాఢ పరిష్వంగనాలలో మైమరచిపోతూ వుండేవాడు..." కరుకుగా సమాధానం యిచ్చాడు షాడో.

వంటికి అంటిన మంచును దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు యూబా. షాడో వంక కోరగా చూస్తూ సామాన్లను ఒకచోట గుట్ట వేయటం ప్రారంభించాడు.

వాటన్నిటినీ మూడు భాగాలుగా చేశాడు షాడో. పొడుగాటి సంచిలో తనకోసం ప్రత్యేకించిన రైఫిల్ ని బయటికి తీసి భుజానికి తగిలించుకున్నాడు. తన వంతు సామాన్లను వీపుకు వ్రేలాడ వేసుకొని దూరంలో కనిపిస్తున్న నామ్‌సో పర్వతాలవైపు

ప్రయాణం ప్రారంభించాడు.

అతనికి వెనుకగా అడుగులు వేయటం మొదలు పెట్టారు యూబా లీనాలు. వెనుక దెబ్బతీసేటందుకు అంతకంటే మంచి ఛాన్సు మరొకటి లేదు.

కాని తన మెంటల్ పవర్స్ మీద భారం వేసి ధైర్యంగా ముందుకు సాగుతున్నాడు షాడో. ప్రమాదం అంటూ  వస్తే తనకు తెలిసి తీరుతుంది. అదీగాక భుజానికి తగిలించుకున్న రైఫిల్ స్టాకు తెల్లటి మెటల్‌తో చేయబడి అద్దంలా మెరిసిపోతోంది. ఆ అద్దంలాంటి పుపరితలం మీద క్లియర్‌గా కనిపిస్తున్నారు యూబా ,  లీనాలు.

చీకటి పడేదాక ప్రయాణం చేస్తూనే వున్నాడు షాడో. నామ్‌సో పర్వతాల్ని సమీపించిన తర్వాత గాని వారు పరిశోధనలు ప్రారంభించటానికి వీలు లేదు.

చీకటిపడటానికి మరో అర గంట వ్యవధి వుందనగా, ఒక పెద్ద పల్లపు ప్రదేశంలో వారికి కనిపించింది చిన్న సెటిల్ మెంట్.

అప్రయత్నంగా అటు అడుగులు వేశాడు షాడో. వెనుక వున్న

లీనా, యూబాలు పెద్ద పెద్ద అడుగులతో వచ్చి అతన్ని కలుసుకున్నారు.

"ఈ రాత్రికి ఆగూడెంలో గడుపుదామా?" అడిగింది లీనా.

తల వూపాడు షాడో.

ఉన్నట్లుండి డైరెక్షన్ మార్చుకున్నది వీస్తున్న గాలి. గూడెం మీదినుంచి షాడో బృందం వైపు వీచసాగింది తెరలు తెరలుగా.

మొదటి తెర తనమీదినుంచి పోగానే, వులిక్కిపడి ఎక్కడి వాడక్కడ ఆగిపోయాడు షాడో, భుజానికి వ్రేలాడుతున్న రైఫిల్‌ని క్రిందికి దించి రెడీగా పట్టుకున్నాడు.

"ఏమిటి రాజూ?" ఆందోళనగా అడిగింది లీనా.

"నీకే తెలుస్తుంది కొంచెం కేర్ ఫుల్ గా వుండండి." అంటూ ముందుకు అడుగులు వేశాడు షాడో.

సెటిల్‌మెంట్‌ని సమీపించిన మరుక్షణం తెలుసుకుంది లీనా. భయంతో మంచు మాదిరి పాలిపోయింది ఆమె వదనం.

మొత్తం పాతిక ఇళ్ళు వున్నాయి ఆసెటిల్ మెంట్ లో.

అక్కడి జనాభాను లెక్కపెట్టాడు షాడో. చిన్నా, పెద్దా కలిపి కనిపిస్తున్న శవాలు వందదాకా వున్నాయి.

కనిపించనివి, మంచు జీవాలకు ఆహారం అయినవి మరో పదిహేను దాకా వుండవచ్చు.

"ఎవరు? ఎవరు రాజూ ఈ పని చేసింది?" కంపిస్తున్న కంఠంతో అడిగింది లీనా.

తెలియదన్నట్లు పెదిమ విరిచాడు షాడో. కుళ్ళిపోయి వాసనలు వెలువరిస్తున్నాయి శవాలు. ఆప్రదేశంలో నిలబడటం చాలా బాధాకరంగా పరిణమిస్తోంది.

శరవేగంతో చుట్టు ముట్టుకున్నాయి చీకట్లు. ఆరాత్రి గడపటానికి వెంటనే మంచి ప్రదేశాన్ని చూసుకోవాలి. చీకటి పడిన తర్వాత ఆ పని చేయటం చాలా కష్టం.

సెటిల్ మెంట్ కి ఒక ఫర్లాంగ్ దూరంలో చిన్న మంచు దిబ్బను గమనించాడు షాడో. చలిగాలిని తట్టుకోవటానికి తగినంత

ఎత్తులో వున్నదది. వెంటనే మరో ఆలోచన లేకుండా ఆమంచు దిబ్బ చాటున కాంప్ వేశాడు.

మోసుకొచ్చిన సంచుల్లో కాన్వాస్ గుడారాలున్నాయి. ఎన్నిరోజులున్నా చెడిపోని ఆహర పదార్థాలు పాక్ చేయబడి వున్నాయి.

యూబా తీసుకువచ్చిన సామానులో మంచును తవ్వటానికి పనికివచ్చే చిన్న పార ఒకటి వుంది. యూబా, లీనా నిద్రపోవటానికి సిద్దపడుతుండగా ఆ పార తీసుకొని పయనమైనాడు షాడో.

"ఎక్కడికి?" ఆశ్చర్యంగా అడిగింది లీనా.

"కొద్దసేపట్లో తిరిగి వస్తాను. మీరు కొంచెం జాగ్రత్తగా వుండండి. సెటిల్‌మెంట్ని నాశనం చేసిన వాళ్ళు యీ పరిసరాలలోనే తచ్చాట్లాడుతూ వుండవచ్చు" అంటూ

చీకట్లలో కలిసిపోయాడు షాడో.

"చీకట్లో ఎక్కడికి పోతున్నాడు?" షాడో మాటలు సరిగా వినిపించని యూబా, లీనాను ప్రశ్నించాడు.

అర్థం కానట్లు తల విదిలించిందామె. షాడోని గురించి ఆమె తెలుసుకున్న విషయాల్లో యిటువంటి సన్నివేశాలు లేవు.

************************

పదిహేను అడుగుల లోతు, పది అడుగులు వెడల్పు వున్న పెద్ద గోతుల్ని త్రవ్వి మంచు మీద పడివున్న శవాలనన్నిటినీ భూస్థాపితం చేశాడు షాడో. ఇగ్లూలలోకి పోయి పెన్సిల్ టార్చి వెలుగులో వాటన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాడు. అనుమానాన్ని కలిగించే విషయాలు ఏవీ కనిపించలేదు. ఇగ్లూల బయట అడుగు జాడలు కూడా అగుపించటం లేదు. యిసుక విరజిమ్మ బడినట్లు గాలి బలంగా వీచినప్పుడల్లా లేచి నలుదిక్కులుకు చెల్లాచెదురౌతున్నది మంచు. ఎటువంటి జాడలైనా ఆ మంచు పొరల క్రిందపడి మాయమ్మై పోతాయి

రెండు నిముషాలలోకి.

షాడో పని పూర్తి అయ్యేసరికి రాత్రి రెండు గంటలు దాటింది. పారను క్రింద పెట్టి జేబులో వున్న పనామా పాకెట్‌ను తీస్తూ ఒక ఇగ్లూ చాటున కూర్చున్నాడు.

మరుక్షణం అక్కడి నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ చెవులు చిల్లులు పడేటట్లు వినవచ్చింది రైఫిల్ మ్రోత. షాడో చేతిలోని పనామా పాకెట్ ఎగిరి అవతల పడిపోయింది. అతని ముని వేళ్ళను ముద్దుపెట్టుకుంటూ పోయి మంచులో దూరింది రైఫిల్ బుల్లెట్.

కత్తితో చీరినట్లు చిమ చిమ లాడటం ప్రారంభించాయి వేళ్ళు. అయినా లెక్కచేయకుండా ఎగిరి పక్కకు దొర్లాడు షాడో.

మరోసారి గర్జించింది ఆ రైఫిల్. బుల్లెట్ షాడో ముఖానికి దగ్గిర్లో పడింది. మరింత వేగంగా దొర్లాడు షాడో. ఒక ఇగ్లూ చాటుకు పోయి బెల్టు వెనుక వున్న రివాల్వర్‌ని బయటికి లాగాడు.

దారుణమైన నిశ్శబ్దం ప్రతిష్టాపితమైంది ఆప్రదేశంలో గాలి కూడా వీచటం మానుకున్నది. రివాల్వర్‌ని ఎడమచేత్తో బిగించి

పట్టుకొని, రైఫిల్ శబ్దం వినవచ్చిన దిశవైపు పాకటం ప్రారంభించాడు షాడో. పాతిక అడుగుల దూరం పోగానే ఒక మెరక ప్రదేశం చాటున మోకరించివున్న ఇద్దరు వ్యక్తులు కనిపించారు. రైఫిల్స్ ని రెడీగా పట్టుకొని ఇగ్లూలవైపే చూస్తున్నారు.

ఒకే ఒక క్షణం సేపు వారిద్దరూ లీనా, యూబాలని భ్రమపడ్డాడు షాడో. మరో రెండు అడుగులు వేయగానే ఆమాట యదార్థం కాదని తెలిసివచ్చింది!

యూబా కంటే లావుగా వున్నారు వారిద్దరూ. తలలమీద ఇనుపటోపీలవంటి వేవో ధరించి వున్నారు.

మరి కొంచెం ముందుకు పాకాడు షాడో. రివాల్వర్ బారెల్ని కుడిచేయి మనికట్టు మీద ఆనించి జాగ్రత్తగా గురిచూశాడు.

ఉన్నట్లుండి లేచి నిలబడ్డాడొక వ్యక్తి. షాడో. మరుక్షణం భీకరంగా గర్జించింది షాడో రివాల్వర్. అరిచి తల్లక్రిందులుగా క్రింద పడ్డాడతను.

గిరుక్కున పక్కకు తిరిగాడు రెండవ వ్యక్తి. షాడో చుట్టూ

తిరిగి వస్తాడని అతను వూహించలేదు కాబోలు! ఆశ్చర్యంగా అరుస్తూ తన రైఫిల్ ని భుజానికి ఆనించుకొని ఎయిమ్ చేశాడు.

అతన్ని ప్రాణాలతో పట్టుకోవాలన్న ఆలోచనను విరమించుకున్నాడు షాడో. ఏ మాత్రం ఆలస్యం చేసినా తన ప్రాణాలు అనంత వాయువుల్లో ఐక్యం అవుతాయి.

నిర్దాక్షిణ్యంగా నిప్పులు క్రక్కింది రివాల్వర్. బాధగా మూలిగి రైఫిల్ని వదిలిపెట్టాడా వ్యక్తి. మొదలు నరికిన చెట్టులా నేల కూలిపోయాడు. నేలను తాకక ముందే అతని శరీరంలో నుంచి వెళ్ళిపోయాయి ప్రాణవాయువులు.

రివాల్వర్ రెడీగా పట్టుకొని లేచి నిలబడబోతున్న షాడో ఎవరో పరిగెత్తుకొస్తున్న సవ్వడి విని పాములా ఒక పల్లం లోకి జరిగాడు.

"రాజూ! రాజూ!!" ఆతృతగా వినవచ్చింది లీనా కంఠం. ఎందుకు ఆతృత? బ్రతికి వున్నాడో మరణించాడో తెలుసుకోవటానికా?

"రాజూ!!" మరోసారి వినవచ్చిందామె పిలుపు.

"హియర్ బేబీ! ఇంకా సజీవంగానే వున్నాను." అంటూ లేచి నిలబడ్డాడు షాడో. ఫాంటు జేబులోని పెన్సిల్ టార్చిని తీసి పడిపోయిన వారి ముఖాలకేసి ఫోకస్ చేశాడు.

"ఎవరు వీళ్ళు?" ఆశ్చర్యంగా అడిగింది లీనా.

వారి దుస్తులనన్నిటినీ జాగ్రత్తగా తడిమి చూశాడు షాడో. మంచు ఎడారుల్లో కనిపించే జాతులకు చెందిన వాళ్ళలా అగుపిస్తున్నారు వాళ్ళు. వారి రైఫిల్స్ మాత్రం చాలా క్రొత్తగా కనిపిస్తున్నాయి. అంతకు మించి మరే విధమైన విషయమూ తెలియలేదు.

*************************

తెల్లవారగానే ప్రయాణం ప్రారంభం అయింది. ఈసారి యూబా చేతినిండా పని తగిలింది. అతని సామానంతా తను తీసుకొని ముందు నడవమని ఆదేశించాడు షాడో. రైఫిల్ని భుజాన వేసుకొని దారి చూస్తూ బయలు దేరాడతను.

క్రమంగా అంతం అవుతున్నది మంచు మైదానం. నామ్‌సో పర్వత పంక్తి దగ్గర్లోకి వచ్చేస్తున్నది.

ఉన్నట్లుండి మార్పు వచ్చింది వాతావరణంలో క్లియర్‌గా వున్న ఆకాశం క్షణంలో మేఘావృతమైంది. ఈదురుగాలి జోరుగా వీచసాగింది. దుమ్ము ఎత్తిపోసినట్లు తెరలు తెరలుగా మీద పడటం ప్రారంభించింది మంచు.

మంచు తుఫాను అది. ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియదు. ఆసమయంలో ప్రాణాలు కాపాడుకోవటం తప్ప చేయగలిగింది ఏమీ లేదు.

"మరికొంచెం దూరం పోతే పర్వత శ్రేణిని సమీపిస్తాం. అక్కడ మనకి మంచి ప్రదేశాలు చాలా కనిపిస్తాయి..." గొంతు చించుకొని అరిచాడు షాడో...లీనా వైపు చూస్తూ.

సగం మాటలనే వినిపించాయామెకు. మిగిలిన సగం వినిపించలేదు. అరిచి ప్రయోజనం లేదని గ్రహించి సైగలు చేశాడు షాడో. తలవూపి పరుగు తీయటం ప్రారంభించిందామె.

ఆమెను అనుసరించటానికి విశ్వప్రయత్నం చేస్తున్న షాడో

హృదయంలో రెండే రెండు ఆలోచనలు మెదులుతున్నాయి. ఏటవాలుగా పైకి లేస్తోంది వారు ప్రయాణిస్తున్న ప్రదేశం.

రాత్రి తను చంపిన వ్యక్తులకు స్నేహితులు ఎవరైనా వుంటే తమ అంతు చూడటానికి వాళ్ళకు యిదొక మంచి అవకాశం. ముందుకు పోయిన యూబా తన విషయాన్ని ఫైనలైజ్ చేయటానికి యింతకు మించిన ఛాన్సు మరొకటి లేదు. ఏదైనా మంచు దిబ్బ చాటున కూర్చుని

షాడో ఆలోచనలు మధ్యలోనే కట్ అయిపోయాయి. ప్రమాదాల్ని ముందుగానే గమనించి అతనికి వార్నింగా యిచ్చే సిక్త్ సెన్స్ డేంజర్ సిగ్నల్స్ పంపటం ప్రారంభించింది.

కనుచివరల నుంచి చుట్టూ చూశాడు షాడో. మంచు తెరలలోనుంచి రోడ్డు రోలర్ల మాదిరి దడదడ శబ్దాలు చేస్తూ వస్తున్న పెద్ద పెద్ద మంచు రాళ్ళను చూసేసరికి ఝల్లుమన్నది అతని శరీరం.

మెరుపులా పక్కకు తిరిగి సురక్షత స్థానానికి పరుగు తీయటం ప్రారంభించాడు. అదే సమయంలో ఒక మంచురాయి ముందు పరగెత్తుతున్న లీనాను ఢీకొట్టింది.

పరిగెత్తటం మీదనే దృష్టిని లగ్నంచేసి వుండటం వల్ల ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గుర్తించలేక పోయింది లీనా. మంచురాయి కాళ్ళకు గుద్దుకోవటంతో, కెవ్వున అరిచి వెల్లికిలా పడిపోయింది. మంచు తుంపరలను నలువైపులా విరజిమ్ముతూ ఆమె మీదినుంచి దొర్లుకుంటూ పోయింది మరొక రాయి.

లీనా అన్ బాలెన్స్ అయిపోయింది. మంచు రాళ్ళమాదిరి దొర్లుతూ పల్లపు ప్రదేశం వైపు జరగసాగింది.

"లీనా!!!" బిగ్గిరగా అరిచాడు షాడో.

ఆ అరుపు ఆమెకు వినిపించలేదు. వినిపించినా ఆమె చేయగలిగింది కూడా ఏమీ లేనట్లు కనిపిస్తోంది. పట్టుచిక్కించుకోవటానికి ఆమె చేసిన ప్రయత్నాలేవీ ఫలించటం లేదు.

గిరుక్కున వెను తిరిగి ఆమె వైపు పరుగు తీశాడు షాడో. "వద్దు... ఆమెను రక్షించి అనవసరమైన కాంప్లికేషన్స్ కొని తెచ్చుకోకు!" అంటూ హెచ్చరించటం ప్రారంభించింది

అంతరాత్మ. వినిపించుకోలేదు షాడో. వేగంగా పరిగెత్తి లీనాను పట్టుకోవటానికి ప్రయత్నించాడు.

అదే సమయంలో శరవేగంతో వచ్చి అతన్ని ఢీకొట్టింది మరో మంచురాయి. బాలెన్స్ తప్పి బోర్లాపడిపోయాడు.

కాళ్ళక్రింద వున్న మంచు పెళ్ళలు వికృత శబ్దాలు చేస్తూ విరిగిపోయాయి.

లీనాతో పాటు దొర్లుతూ పోయి ఒక పెద్ద గోతిలో పడ్డాడు షాడో. లేచి నిలబడటానికి ప్రయత్నించాడు... తట్టలతో కుమ్మరించినట్లు మీద పడింది మంచు.

దగ్గిర దగ్గిరగా రెండువందల అడుగుల లోతు వున్నదా గోయి. తుఫాను తగ్గితే కాని పైకి పోవటం కుదరదు.

నిర్జీవంగా పడివున్న లీనాను ఒక ప్రక్కకు లాగి, భుజాలకు తగిలించి వున్న కాన్వాస్ సంచుల్ని క్రిందికి దించాడు. తన సామానులోవున్న ప్లాస్టిక్ టెంట్ ని వూడతీసి, పైనుంచి మంచు పడకుండా మీద కప్పుకొని, లీనాను దగ్గిరికి తీసుకున్నాడు.

ఒక పగలు ఒక రాత్రి కురిసింది దాబుణమైన మంచు వర్షం. ప్రతి పావుగంటకూ, మీద పేరుకుంటున్న మంచును విదిలించి వేస్తూ, ముంగాళ్ళమీద కూర్చుని టైంపాస్ చేశాడు షాడో. రెండువందల అడుగులలోతున్న గోయి మంచు తుఫాను నిలిచేసరికి నూట యాభై అడుగులే అయింది. యాభై అడుగుల ఎత్తున పేరుకున్నది మంచు.

"మనం ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా ఈ మంచులో సమాధి ఐపోయే వాళ్ళం!!" మంచు తుఫాను శాంతించిన మరుక్షణం టెంట్ లోనుంచి బయటికి వస్తూ కామెంట్ చేసింది లీనా.

"బిగతీసుకొని టెంట్‌లో కూర్చోవటం తప్ప నువ్వు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి?" అనబోయి ఆఖరిక్షణంలో ఆ మాటల్ని మ్రింగేశాడు షాడో.

షో డౌన్ కి యింకా టైం రాలేదు. ఆ టైం వచ్చినప్పుడు అసలు ఇటువంటి మాటలతో అవసరం వుండనే వుండదు వచ్చిన పనిని గురించి మరిచిపోయి మరో దారి తొక్కకూడదు.

సామాన్ల ప్రక్కన పడేసిన మంచు పారను అందుకొని పైకి

పోయేటందుకు దారిని ఏర్పరచటంలో మునిగిపోయాడు షాడో. సామాన్లనన్నిటినీ సంచుల్లోకి ఎక్కించి ప్రయాణానికి సిద్ధం అయింది లీనా.

పగలు పది గంటలు అవుతుండగా గోతిలోనుంచి తల బయటికి పెట్టి మంచు మైదానాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు షాడో. కదలిక అనేది ఎక్కడా కనిపించటం లేదు. తెల్లటి లాంగ్ క్లాత్ గుడ్డ పరచినట్లు కనిపిస్తోంది మైదానం.

మైదానం మీదికి వచ్చి లీనాకు చేయి అందించి పైకి లాగుతుండగా దూరంలో కనిపించాడు యూబా.

"క్షేమంగా వున్నారా? థాంక్ గాడ్!! మీరు ఐపోయారనే అనుకుంటున్నాను." అన్నాడు పరుగు పరుగున వచ్చి.

ఆ మాటలకు కూడా సమాధానం యివ్వలేదు షాడో. మంచురాళ్ళు వాటంతట అవు కాళ్ళు వచ్చి దొర్లలేదు. ఎవరో కావాలనే చేశారా పని. ఆ పని చేసింది ఎవరో తెల్సుకోవటం ఎంతో కష్టమైన పని కాదు, కాని అందుకు సమయం కాదది.

కాన్వస్ సంచిలోవున్న రైఫిల్ని భుజం మీద వేసుకొని

ముందు దారితీశాడు షాడో. పది అడుగుల వెనుకగా బయలుదేరారు లీనా, యూబాలు. బహుశా తమ అనుభవాల్ని గురించి ముచ్చటించుకుంటున్నారేమో!!

మధ్యాహ్న సమయానికి నామ్‌సో పర్వత పాదాల్ని సమీపించారు వాళ్ళు.

ఒకపెద్ద మంచుగుహను చూసి, చేయి వుపాడు షాడో. దాన్ని బేస్ గా చేసుకొని తమ పరిశోధనలు ప్రారంభించాలి.

ఉన్నట్లుండి వెర్రిగా అరిచింది లీనా. అదిరిపడి వెనక్కి చూశాడు షాడో.

"లుకౌట్! లుకౌట్!!!" అని తరుస్తూ తన రైఫిల్ ని ఎత్తి మంచుగుహ వైపు గురిపెట్టాడు యూబా.

అతని రైఫిల్ పైకి లేవటాన్ని చూడగానే తల్లక్రిందులుగా పల్టీ కొట్టి ఒక బండ చాటున పడ్డాడు షాడో.

మరుక్షణం భీకరంగా అరుస్తూ ఆ మంచు వైపు జంప్ చేసింది ఒక మంచు ఎలుగుబంటి. వెనుకా ముందూ

చూడకుండా భుజం మీద రైఫిల్ ని దానికేసి గురిపెట్టాడు షాడో. ప్రపంచంలో డేంజరస్ యానిమల్ అంటూ ఏదయినా వుంటే

అది మంచు ఎలుగుబంటి మాత్రమే. అడవి జంతువులు ఏవయినా ఆకలి వేస్తే తప్ప వేట ప్రారంభించవు. సామాన్యంగా మనుషుల జోలికి పోవు అవి.

కాని మనుషులు కనిపిస్తే మహదానందంగా వచ్చి మీద పడుతుంది మంచు ఎలుగుబంటి. ఏనుగుల్నైనా చంపవచ్చు! వాటిని చంపటం ఒక పట్టాన సాధ్యపడదు. చైనీస్ కాంప్‌లో మంచు ఎలుగు గురించి అషీబా చెప్పిన విషయాలన్నీ షాడో చెవుల్లో మార్మోగాయి. పెదమలు బిగించి రైఫిల్ బారెల్‌ని దాని మెదడుకేసి గురిపెట్టాడు.

కొండ గుహలా నోరు తెరుచుకొని మీదికి వచ్చేస్తున్నదది......

ఊపిరి బిగపట్టి ట్రిగ్గర్ నొక్కాడు షాడో.

క్లిక్ మన్నది రైఫిల్. మాగజైన్ లో ఏదో పాడైపోయిన బుల్లెట్ వున్నట్లుంది! కళ్ళను ఎలుగుబంటి మీదినుంచి తిప్పకుండా

శరవేగంతో ఆ బుల్లెట్ ని ఎడ్జెస్ట్ చేసి ట్రిగ్గర్ రాడ్ ని గట్టిగా ప్రెస్

చేశాడు షాడో.

గావురుమంటూ వచ్చి మీదపడింది ఎలుగుబంటి ధన్ మని చెవులు చిల్లులు పడే శబ్దంతో ప్రేలవలసిన రైఫిల్ క్లిక్ మని మౌనవ్రతం అవలంభించింది మరోసారి.

చురకత్తుల్లాంటి ఎలుగుబంటి గోళ్ళు షాడో ఎడమచేయి మీదపడి రక్తాన్ని రుచి చూశాయి. రైఫిల్ తో తంటాలు పడటం అంత పిచ్చిపని మరొకటి లేదని గ్రహించాడు షాడో. మోకాళ్ళ మీద లేచి రైఫిల్ బారెల్ ని ఎలుగుబంటి డొక్కలో గుచ్చాడు.

వికృతంగా అరిచి మంచులో పడిందది. క్షణంలో లేచి నిలబడింది మళ్ళీ. ఆ కాస్త వ్యవధిలో బెల్టు వెనుకవున్న రివాల్వర్ని బయటికి లాగాడు షాడో. లేచి నిలబడుతున్న ఎలుగుబంటి నోటికేసి గురిచూసి ట్రిగ్గర్ నొక్కాడు.

ధనాధన్ ధనాధన్ మని మ్రోతలుచేస్తూ దాని నోటిలోనుంచి మెదడులోకి దూసుకుపోయాయి నాలుగు బుల్లెట్లు.

ఒక్కక్షణం పాటు ఆగి తల విదిలించిందది....క్రూరంగా చూస్తూ అడుగు కదిలించింది. మరోసారి ట్రిగ్గర్ నొక్కాడు

షాడో. సర్రున దూసుకుపోయాయి రెండు బుల్లెట్లు. మరో రెండు అడుగులు వేసింది ఎలుగుబంటి. రివాల్వర్ లోని బుల్లెట్లు ఖాళీ అయిపోయాయి. దాన్ని క్రిందికి వదిలి, బూటుకు అడ్డంగా బిగించివున్న డాగర్ ని లాగాడు షాడో.

దగ్గరికి వచ్చింది ఎలుగుబంటి. ఉన్నట్లుండి పెద్దగా మూలిగి అలాగే విరుచుకు పడిపోయింది. దాని మెదడులో నుంచి వెలువడుతున్న రక్తం మంచు మీదపడి మడుగుకట్టడం ప్రారంభించింది.

డాగర్ని మనికట్టుకు ఆనించి అండర్ హేండ్ త్రోకు రెడీ అవుతూ యూబావైపు తిరిగాడు షాడో.

కనిపించిన దృశ్యం అతని ఆలోచనలన్నిటినీ మాయం చేసేసింది. రైఫిల్ ని ప్రయోగించటంలో తికమక పడినట్లున్నాడు యూబా..... అతని మీదికిదూకిన ఎలుగుబంటి రైఫిల్ ని అవతలకు తోసి, మెడను పట్టుకుంది. ఎలుకను పట్టుకున్న పిల్లి విదిలించినట్లు అటూ యిటూ విదిలిస్తోంది మెడ ఎముకలు విరగదీయటానికి.

పిచ్చిగా అరుస్తూ పరుగులు తీస్తోంది లీనా. మరో

ఎలుగుబంటి వేటకుక్కలా ఆమె వెంటబడి తరుముతున్నది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా యూబావైపు పరుగెత్తాడు షాడో. కనుచివరలనుంచి అతని ఆగమనాన్ని గమనించి గుర్రుమంటూ హెచ్చరిక చేసింది ఎలుగు.

కేర్ చేయకుండా దాని వీపుమీద ఎటాక్ చేశాడు షాడో. బర్ మని వెనక్కి తిరిగిందది. శక్తినంతా చేతుల్లోకి తెచ్చుకొని దాని కంఠం మీద పొడిచాడు షాడో. ఒకటి రెండు మూడు నాలుగు....ఐదు పోట్లు పడ్డాయి. పంజాల్ని ఎత్తి షాడో భుజాల మీద దించింది ఎలుగు. నోటిని అతని మెడ దగ్గరికి తీసుకొస్తోంది.

ఆఖరిసారిగా శరీరంలోని శక్తినంతా కూడగట్టుకొని దాని తలమీద పొడిచాడు షాడో. పుర్రెకు తగిలి ఖంగు మన్నది డాగర్ బ్లేడు. రెండుగా విచ్చింది ఎలుగుతల. బాధగా తలవిదిలిస్తూ నేలమీద వాలిపోయిందది. రెండుక్షణాలు గిలగిలా తన్నుకొని ప్రాణాలు వదిలింది.

నిర్జీవంగా పడివున్న యూబావైపు ఒకసారి చూసి, లీనా పోయిన దిశలో పరుగు ప్రారంభించాడు షాడో.

ప్రాణాలన్నిటినీ కాళ్ళలోకి తెచ్చుకొని పరుగులు తీస్తున్నది లీనా. ఆమెకు ఎలుగుబంటికి వున్న మధ్యమార్గం క్షణ క్షణానికి తగ్గిపోతున్నది.

పది నిముషాలసేపు పరుగుతీసిందామె. ఒక గోతిలో కాలుపడి అన్ బాలెన్స్ అయిపోయింది. వెంటనే మీదికి దూకింది ఎలుగుబంటి.

భయంతో బిగ్గరగా అరిచి, కళ్ళు మూసుకుంది లీనా పదునైన ఎలుగుబంటి పంజాలు కంఠంలో దిగబడే క్షణంకోసం ఎదురుచూస్తూ.

ఎంతసేపటికి ఆ పని జరగలేదు. ఉన్నట్లుండి ఆమె మీదనుంచి లేచి అవతల పడింది ఎలుగుబంటి. దాని గురకల్లో ఏదో మార్పు వినిపించటంతో ఆశ్చర్యంగా చూసింది లీనా.

ఎడమచేత్తో ఎలుగుబంటి పంజాను పట్టుకొని కుడిచేత్తో దాని గుండెల్లో గుద్దుతున్నాడు షాడో. బాధగా అరుస్తూ అతన్ని పట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నది. మెరుపులా వెనక్కి జరిగి తప్పుకుంటున్నాడు షాడో. అదును దొరకగానే దాని మూతిమీద పొడుస్తున్నాడు పిడికిలితో.

తన భయాన్ని మర్చిపోయి విప్పారిన నేత్రాలతో ఆదృశ్యాన్ని చూస్తూ వుండిపోయింది లీనా.

ఉన్నట్లుండి ఒక అడుగు వెనక్కివేశాడు షాడో. భయంకరమైన కరాటే సింహనాదం అతని కంఠనాళాలలో నుంచి వెలుపలికి వచ్చింది. కంటికి కనిపించనంత వేగంగా కదిలింది అతని కుడికాలు.

ఫట్ మని శబ్దం చేస్తూ పగిలింది ఎలుగుబంటి తల. కుడికాలు నేలకు ఆనకముందే మరోసారి గాలిలోకి ఎగిరాడు షాడో. ఇంకా వేగంగా పోయి ఎలుగుబంటి గుండెలమీద తగిలింది ఎడమకాలు.

గింగరాలు తిరుగుతూ నేల కూలిపోయిందది. చూస్తూండగానే దాని ప్రాణవాయువుల అనంత విశ్వంలోకి ఎగిరి పోయాయి.

తమ కరాటే **ఎక్స్ పర్ట్స్** చెప్పిన మాటలు లీనా చెవుల్లో ప్రతిధ్వనించాయి.

"కరాటే లో షాడోకి తెలియని ట్రిక్ అంటూ ఏమీలేదు. ఆ

టెక్నిక్స్ అన్నిటిలోను అతనికి ప్రియమైనది ఫ్లయింగ్ కిక్. కాని డబుల్ కిక్ ప్రయోగించే సమయంలో ఎదిరించటానికి ప్రయత్నించకండి. ఫ్లయింగ్ కిక్ నైనా తప్పించుకోవచ్చు గాని అతని డబుల్ కిక్ ని తట్టుకొని నిలబడటం చాలా కష్టం"

కారణమేమిటో ఆసమయంలో లీనాకు అర్ధంకాలేదు.

క్రిందపడిన డాగర్ ని అందుకొని బూటు ప్రక్కకు పోనిస్తూ లీనావైపు వచ్చాడు షాడో. తన ఆలోచనలను మధ్యలోనే అణచివేసుకొని నిలబడిందామె.

చెవుల క్రిందనుంచి భుజపు ఎముక దాకా అరంగుళం వెడల్పు చీరుకుపోయింది యూబా మెడ. ఎర్రటి రక్తం వెల్లువలా వెలుపలికి వచ్చి మంచుమీదికి జారుతున్నది.

"రాజూ! బ్రతుకుతాడంటావా?" గద్గదికంగా అడిగింది లీనా.

కాన్వాస్ సంచుల్లో వున్న ఫ నామ్సో ఎయిడ్ కిట్ నితీసి, ప్రథమ చికిత్స ప్రారంభించాడు షాడో. గాయాల్ని శుభ్రంగా తుడిచి కట్లు కట్టాడు.

పదినిముషాల తర్వాత కళ్ళుతెరిచాడు యూబా. వెంటనే అతని ముఖంలో ఆందోళనచ్ఛాయలు కనిపించాయి.

"ఇట్సాల్ రైట్ యూబా! ప్రమాదం ఏమీలేదు. ఎలుగు బంట్లన్నిటినీ రాజు చంపేశాడు." అతని ప్రక్కన మోకరించి కూర్చుంటూ అన్నది లీనా.

షాడో వంక చూశాడు యూబా. అతని ముఖంలో అనేక రకాలైన భావాలు చోటుచేసుకోవటం ప్రారంభించాయి.

అదేమీ గమనించనట్లు క్రిందపడిన కాన్వాస్ సంచులనన్నిటినీ కలిపి ఒకే మూటగా కట్టి వీపుకు తగిలించుకున్నాడు షాడో.

"నా రివాల్వర్ మ్రోతలు విని ఎవరైనా రావచ్చిక్కడికి. ఆ వచ్చే వాళ్ళు ఎటువంటి వాళ్ళో తెలియకుండా మనం వారి కళ్ళపడటం మంచిదికాదు. పర్వతాలు మీదికి పోదాం పదండి" అంటూ యూబాను చంటిబిడ్డలా చేతుల్లోకి ఎత్తుకోని కొండచెరియల వైపు అడుగులు వేశాడు .

యూబా ముఖం తెల్లగా పాలిపోయింది. ఏదో చెప్దామని

నోరు తెరిచాడు. షాడో ప్రక్కగా అడుగులు వేస్తున్న లీనా ఎందుకో చిన్నగా దగ్గింది. ఆమె వంక చూసి తెరిచిన నోటిని చటుక్కున క్లోజ్ చేసుకున్నాడు యూబా.

తనలో తను నవ్వుకుంటూ దృష్టినంతా పర్వత శఖరాల వైపే కేంద్రీకరించాడు షాడో. పశ్చాత్తాపపడటం అనేది ఒక దైవీకమైన మార్పు. బెదిరించి భయపెట్టి ఆ మార్పు రాకుండా ఆపలేరు ఎవరూ. ఏదో కన్ ఫెస్ చేయబోతున్నాడు యూబా! ఉరిమిచూసి అతని నోరు మూయించింది లీనా. ఎంతకాలం అలా బెదిరించగలదు?

ఉన్నట్లుండి షాడో దృష్టి ఒక చిన్న లోయ వైపు మరలింది. ఎలుగుబంటి చర్మాలను ధరించి, పొడుగాటి బరిశెల్ని పట్టుకొని మంచురాళ్ళ వెనుక నిలబడి వున్నారు నలుగురు వ్యక్తులు.

నిదానించి చూశాడు షాడో. తన చేతిలో మరణించిన వారి దుస్తులమాదిరి కనిపించటంలేదు వీరి దుస్తులు.

"లీనా... నువ్వు యిక్కడే వుండు. నేను పోయి వారితో

మాట్లాడి వస్తాను..." అంటూ యూబాను క్రిందికి దించి వీపుమీది సంచుల్ని నేలకు వదిలాడు షాడో.

"రాజూ! ఇది తీసుకుపో..."అంటూ తను వెంటబెట్టుకు వచ్చిన యూబా రైఫిల్ ని ముందుకు జాచిందామె.

దాని వంకా ఆమెవంకా చూసి చిన్నగా నవ్వాడు షాడో. "నో థేంక్స్! కాళ్ళకు చేతులకు అడ్డం పడటం తప్ప మీ రైఫిల్స్ ఎందుకూ పనికిరావు" అంటూ లోయవైపు అడుగులు వేశాడు.

ఎర్రబడింది లీనా ముఖం. ఏమని సమాధానం ఇవ్వాలో అర్థంకాక రాతి బొమ్మలా అలాగే నిలబడిపోయింది.

సూటిగా ఆ వ్యక్తుల దగ్గరికి పోయాడు షాడో. వారు బరిశెల్ని తనవైపు గురిపెట్టటాన్ని గమనించి కుడిచేతిని గాలిలోకి ఎత్తాడు.

"ఎవరు నువ్వు?" అతుకు బొతుకుల చైనీస్ భాషలో అడిగాడు ఒక వ్యక్తి.

"దారి తప్పి చక్కర్లు కొడుతున్న పరదేశిని. నా సహచరుడు గాయపడ్డాడు. అతనికి సరయిన వైద్యసహాయం కావాలి. తల దాచుకోవటానికి షెల్టర్ కావాలి...." అన్నాడు షాడో.

"ఇందాక మాకు రైఫిల్ మ్రోతలు వినిపించాయి. అవి "అంటూ ప్రశ్నార్ధకంగా చూశాడు ఒక వ్యక్తి.

"పర్వతాల్ని సమీపిస్తుండగా మమ్మల్ని మూడు ఎలుగుబంట్లు ఎటాక్ చేశాయి. వాటిని చంపటానికి రివాల్వర్ వుపయోగించాను. మీకు బాగా వుపయోగపడతాయి ఆ ఎలుగులు వాటిని తీసుకొని షెల్టర్ యివ్వండి" అన్నాడు షాడో.

చింపి చాటల్లా తయారైనాయి వారి వదనాలు. మంచు ఎలుగుల్ని చంపటం చాలా కష్టం. వాటి చర్మాలు చాలా విలువ చేస్తాయి. ఉత్త పుణ్యానికి మూడు ఎలుగులు లభిస్తున్నాయి!

"గాయపడిన మనిషిని మన యిళ్ళకు తీసుకు పొండి. మేం ఎలుగుల్ని లాక్కొస్తాం" యిద్దర్ని యూబా వైపు పంపించి, మిగిలిన యిద్దరూ షాడో చూపించిన దిశలో పరుగులు

ప్రారంభించారు. లీనాను మంచు మనుష్యుల వెంట వెళ్ళమని ఆదేశించి వారిని అనుసరించాడు షాడో.

ఎలుగుబంట్లను మంచులో పడేసి యీడ్చుకుంటూ ఎదురుపడ్డారు వారు. వారితో కబుర్లు చెపుతూ అడుగులు వేస్తున్న షాడో కళ్ళు పర్వత శిఖరాల మీద ఒక మెరుపును పసికట్టాయి.

వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని అదిమి పట్టుకొని కాజువల్ గా ఆ మెరుపుకు కారణాన్ని అన్వేషించాడు.

నామ్‌సో శిఖరంమీద నిలబడి వున్నాడు తెల్లటి దుస్తులు ధరించిన ఒకవ్యక్తి. అతని దుస్తులు అతని చుట్టూ వున్న పరసరాలతో కలిసిపోయి అక్కడ మనిషి వున్నట్లు తెలియటం లేదు. అతన్ని షాడోకు పట్టి యిచ్చింది ఆ దుస్తులు కాదు నల్లగా నిగనిగలాడుతున్న బైనాక్యులర్స్!

వాటిలోనుంచి దీక్షగా షాడో బృందాన్నే పరిశీలిస్తున్నాడతను.

షాడో మంచు మనుష్యుల సెటిల్‌మెంట్‌ని సమీపించేసరికి చీకటి పడింది. ఆసరికి ఆ సెటిల్‌మెంట్‌ని గురించిన

వివరాలన్నిటినీ తెలుసుకున్నాడు. మొత్తం పదహేను ఇగ్లూలు వున్నాయక్కడ. వాటన్నిటికీ పెద్ద ఎనభై సంవత్సరాల వయసున్న ఉలూ అనేవ్యక్తి. అక్కడ వున్న వారందరూ అతనికి కొడుకులు, తమ్ముళ్ళు, మనవళ్ళు అవుతారు.

అన్నిటికంటే పెద్దగా కనిపిస్తున్న ఇగ్లూ ముందు నిలబడి వున్నాడు ఉలూ. బోసినోటితో పెద్దగా నవ్వుతూ షాడోకి ఎదురు వచ్చాడు.

"వట్టి చేతులతో మంచు ఎలుగును చంపిన మొనగాడికి స్వాగతం! ఈ రోజు నా వంశం తరించింది. మా జన్మలు ధన్యమైనాయి" అనే అర్థం వచ్చే పచ్చి మాటలు మాటాడుతూ కౌగిలించుకున్నాడు.

చెమటకంపు షాడో నాశికా పుటాలను బ్రద్దలు చేసింది. అతి ప్రయత్నంమీద తమాయించుకొని సగౌరవంగా అతనికి నమస్కరించాడు షాడో. తమకు ఆశ్రయం యిస్తున్నందుకు కొన్ని వేల కృతజ్ఞతలు తెలియచేసుకున్నాడు.

వెంటనే అతన్ని తన ఇగ్లూ లోకి లాక్కుపోయాడు ఉలూ.

అతని వంశంలోని ఆడవాళ్ళందరూ అక్కడ సమావేశమై వున్నారు. అరవై సంవత్సరాల వృద్ధురాలి దగ్గర్నించి ఆరు నెలల పసిపాపల వరకూ షాడోని క్రిందినుంచి పైదాకా పరిశీలించి తృప్తిగా తలలు వూపారు.

ఒక చర్మపు ప్లేటులో ఉడకబెట్టిన మంచు చేపల మాంసాన్ని షాడో ముందు పెట్టింది ఉలూ భార్య.

మిగిలిన వారందరూ షాడో చుట్టూ చేరి వినోదంగా చూస్తున్నారు. కడుపులోని ప్రేవులు మెలికలు తిరుగుతున్నట్లు ఫీల్ అయ్యాడు షాడో. ఆ ఆహారం వంక చూస్తే చాలు బొడ్డు దగ్గర్నించి బయలుదేరుతుంది వామిటింగ్ సెన్సేషన్. కాని తినకపోతే తప్పుగా భావిస్తారు వాళ్ళు. తమను అవమానపరచినట్లు ఫీల్ అయ్యే అవకాశం వుంది. కళ్ళు మూసుకొని బలవంతంగా ఆచేప ముక్కల్ని నోట్లో పెట్టుకున్నాడు.

అరిగిపోయిన రికార్డులా అదీ యిదీ మాట్లాడుతూనే ఉన్నాడు ఉలూ. లీనా యూబాలు మరో ఇగ్లూలో విశ్రాంతి తీసుకుంటున్నట్లు చెప్పాడు షాడో అడగకముందే.

అతి ప్రయత్నం మీద ప్లేటును ఖాళీ చేసి నీరసంగా ఇగ్లూ గోడకు అడ్డం పెట్టివున్న ఎలుగు చర్మాన్ని ఆనుకున్నాడు షాడో. జేబులోవున్న సిగరెట్ పాకెట్ ని తీసి ఉలూ చేతికి అందించాడు.

క్షణంలో ఖాళీ అయిపోయిందది. అక్కడవున్న మగవాళ్ళందరూ సగం సగం సిగరెట్లను వెలిగించుకొని ఉలూకు, షాడోకు మాత్రం రెండు ఫుల్ సిగరెట్లను యిచ్చారు.

"మా అన్నకు నలుగురు కూతుళ్ళు వున్నారు. నలుగురూ వంటరిగానే వున్నారు. నీకు యిష్టం వచ్చిన వాళ్ళను ఎంచుకోమని అంటున్నాడు మా నాయన..." సిగరెట్ వెలిగించుకుంటున్న షాడోతో అన్నాడు ఉలూ రెండవ కొడుకు.

ఉలిక్కిపడి ఉలూ వంక చూశాడు షాడో.

కిసుక్కున నవ్వారు అక్కడవున్న ఆడవాళ్ళందరూ. వంటరిగా వున్న ఆ నలుగురు ఆడపిల్లలు తలలు వంచుకొని ఓరగా చూడసాగారు షాడో వంక.

"మీ ఆతిధ్యానికి ఎలా కృతజ్ఞతలు తెలియపరుచుకోవాలో నాకు అర్ధం కావటం లేదు. ఇప్పుడు నేను వంటరిగా

ఆడవాళ్ళని వెంట వేసుకు తిరిగే పరిస్థితిలో లేను. మీ మాటను కాదంటున్నందుకు మన్నించండి...." అన్నాడు షాడో ఉలూ భుజం మీద చెయ్యి వేసి.

నవ్వటం ఆపేశారు అక్కడి వారందరూ.

మంచు తుఫాను వచ్చేటందుకు ముందు మేఘావృతం అయిన ఆకాశంలా నల్లబడింది ఉలూ ముఖం.

"నిన్ను ఆనందపరచటానికి ఆమాట అనలేదు నేను. వట్టి చేతులతో మంచు ఎలుగుల్ని చంపే రక్తం యీ మంచు జాతుల్లో లేదు. నీమూలకంగా నా వంశంలో అటువంటి రక్తం ప్రవేశించాలి, ఈ మంచు జాతుల నన్నిటినీ జయించే బిడ్డలు నా వంశంలో పుట్టాలి" సీరియస్ గా చూస్తూ అన్నాడు ఉలూ.

ఆ సిచ్యువేషన్ లోనుంచి ఎలా తప్పించుకోవాలా అని ఆలోచించటం ప్రారంభించాడు షాడో. తనకీ గతి పట్టటానికి కారకులు ఎవరు? యూబా, లీనాలలో ఎవరో మంచు ఎలుగుల పోరాటాన్ని వివరించి చెప్పినట్లున్నారు.... ఏం చెయ్యాలి యిప్పుడు??

షాడో ఆలోచనలు పూర్తి కాకముందే ఒకరి తర్వాత ఒకరుగా బయటికి జారుకున్నారు ఉలూ ఫామిలీ.

ఆలోచనల నుండి బయటపడి తల ఎత్తిన షాడోకు ఇగ్లూ ద్వారాన్ని ఎలుగుబంటి చర్మంతో సూది మొనదూర్చే సందుకూడా లేకుండా గట్టిగా మూస్తున్న ఉలూ కనిపించాడు.

"ఉలూ! ఒకమాట!! జస్ట్ ఎ మినిట్!!!" అంటూ లేవబోయాడు షాడో. ఆ హడావుడిలో తను వున్నది మంచు గుహలో అన్న విషయం మర్చిపోయి నిఠారుగా నిలబడ్డాడు.

ఠక్కున పొడుచుకుంది ఒక మంచుపలక. దిమ్మరపోయి నేలమీద చతికిల పడ్డాడు. పకపక నవ్వుతూ వచ్చి చుట్టూ చేరారు వంటరిగా వున్న ఆనలుగురు పడుచులూ. తిరిగి లేచే అవకాశం యివ్వకుండా మీదపడి గాలిచొర రానంత గాఢంగా కౌగిలించుకున్నది ఒక పడుచు. బుగ్గల మీద వేళ్ళుంచుకొని వినోదంగా చూడసాగారు మిగిలిన వారు ముగ్గురూ.

ఆ ఇగ్లూలోనుంచి బయటపడేసరికి షాడో తల ప్రాణం తోకకు వచ్చినంత పని అయింది. ఒక రాత్రి, ఒక పగలు అతన్ని వదిలిపెట్టలేదు ఆ పడుచులు. ప్రతి నాలుగు గంటలకు చర్మపు

ప్లేట్లలో చేపల మాంసాన్ని పెట్టి ద్వారం దగ్గిర వుంచేవాడు ఉలూ. ఖాళీగా వున్న పడుచుల్లో ఎవరో ఒకరు ఆప్లేట్లను అందుకొని షాడో ముందు పెట్టేవాళ్ళు.

మూడవరోజు తెల్లవారుఝామున ఆ పడుచులు నిద్రపోతుండగా లేచి, చల్లగా యిగ్లూలో నుంచి బయటికి వచ్చాడు షాడో.

రెండు అడుగులు వేయకముందే ఎవరో దగ్గిన సవ్వడి వినిపించింది. మెరుపులా అటు తిరిగాడు. పిడికిలి బిగించి చేతిని ఎత్తబోతూ, ఇగ్లూ చాటున నిలబడి వున్న ఉలూ రెండవ కొడుకును గుర్తుపట్టి తేలికగా నిట్టూర్చాడు.

"ఏమైనా కావాలంటే ఆ పిల్లల్ని పంపించవచ్చు గదా? నువ్వెందుకు వచ్చావ్? " అంటూ యివతలికి వచ్చాడతను.

ఎత్తి అవతలకు విసురుదామన్న కోరికను బలవంతంగా అణగ ద్రొక్కుకుని, ముఖం చిరునవ్వు నొకదాన్ని పులుముకున్నాడు షాడో.

"యూబా ఎలా వున్నాడో చూడాలనిపించింది. లీనా ఏం చేస్తుంది?" అని అడిగాడు చుట్టూవున్న యిగ్లూల వంక చూస్తూ.

"ఇంకో పది  పదిహేను రోజులదాకా అతను పక్కమీది నుంచి లేవలేడు. మా నాయన అతనికి సేవలు చేస్తున్నాడు. ఇకపోతే నువ్వు మా పిల్లలతో వుండటం మీ అమ్మాయికు యిష్టం లేనట్లుంది. పొద్దుటినుంచీ ఒకటే గోల! తోడు కావాలేమో!!" అన్నాడతను.

ఉబికి వస్తున్న నవ్వును బలవంతంగా అదిమి పట్టుకొని దూరంగా కనిపిస్తున్న మంచు గుట్టలవైపు బయలుదేరాడు షాడో. పొడుగాటి బరిశెను భుజంమీద వేసుకొని తోకలా వెంబడించాడు ఉలూ రెండవ కొడుకు.

"నా సామాను ఎక్కడ వుంది" ప్రశ్నించాడు షాడో. తన కాన్వాస్ సంచిలో వున్న సిగరెట్ పాకెట్ని తీసుకురమ్మని ఆదేశించాడు.

చెంగు చెంగున పరిగెత్తాడతను. రెండు నిముషాల

అనంతరం ఒక ఇగ్లూలోనుంచి పెద్దగా వినవచ్చింది లీనా కంఠస్వరం.

"బ్లడీ రోగ్! అనుమతి లేకుండా లోపలికి రావద్దని ఎన్నిసార్లు చెప్పాలి? ఆసంచులతో నీకేం పని? ఆసంచిని క్రింద పెడతావా, లేదా ?"

ఆమె మాటల్ని ఖాతర్ చెయ్యకుండా శరవేగంతో తిరిగి వచ్చాడతను.

"అబ్బ! ఏం పిల్లరా బాబూ... చూస్తే సీలు చేప ఎముకంత లేదు, గొంతు మాత్రం మంచుతోడేలు మాదిరి ఖంగుమంటోంది..." అంటూ సిగరెట్ పాకెట్‌ని, లైటర్‌ని షాడో చేతిలో పెట్టాడు.

అతనికొక సిగరెట్‌ని యిచ్చి తనొకటి వెలిగించుకున్నాడు షాడో. మంచుదిబ్బల్ని సమీపించి ఒక పల్లపు ప్రదేశంలో కూర్చున్నాడు. సిగరెట్ పొగను గుప్పుగుప్పున వదులుతూ చిన్నపిల్లాడిలా తనలో తను నవ్వుకుంటున్నాడు ఉలూ కొడుకు.

"ఈ ప్రాంతంలో మాలాంటి పరదేశీయులు ఎవరైనా తిరుగుతూ వుంటారా?...." అంటూ సంభాషణను ప్రారంభించాడు షాడో.

"ఒకటి  రెండు సార్లు దూరంలో కనిపించారు. మాట్లాడే అవకాశం రాలేదు. మమ్మల్ని చూడగానే కొండల్లోకి పారిపోయారు."

"ఆఖరి సారిగా ఎప్పుడు కనిపించారు?"

లెక్కలు కట్టాడు ఉలూ కొడుకు. రెండుక్షణాలు ఆలోచించి ఒక చేతిని చూపించాడు.

"అవునూ! ఎప్పుడైనా భూకంపాలలాంటివి యిక్కడ వస్తుంటాయా?" అడిగాడు షాడో.

"భూకంపం అంటే ఏమిటి?"

ఈసారి ఆలోచించాల్సిన వంతు షాడోది అయింది...ఎంత ట్రైచేసినా భూకంపం అంటే ఉలూ కొడుక్కి అర్థం కాలేదు.

అతనితో బాధలు పడలేక ఆ పాయింట్‌ని డ్రాప్ చేసుకున్నాడు షాడో.

ఆసరికి తెల్లబడింది తూర్పుదిక్కు ఒకరొకరుగా ఇగ్లూలలోనుంచి బయటికి వస్తున్నారు ఉలూ ఫామిలీ... వాళ్ళు తనకేసి చూస్తున్న చూపుల్ని గమనించేసరికి షాడో వళ్ళు కంపరం ఎత్తింది.

"నేను అలా  అలా తిరిగివస్తాను. నువ్వు ఇగ్లూకు వెళ్ళు..." అంటూ లేచి నిలబడ్డాడు.

"వేటకు పోతున్నావా? నాయన్ను పిలుస్తాను. అందరం కలిసే పోదాం!" అంటూ పెద్దగా అరిచి కేకలు పెట్టటానికి ప్రయత్నించాడు ఉలూ కొడుకు.

చటుక్కున అతని నోటిని అదిమాడు షాడో. "వంటరిగా పోవాల్సిన పని ఒకటి వుంది. వెంటనే తిరిగి రాకపోతే మీరేమీ గోల చేయకండి. నేను ఎక్కడికి పోయానో ఎవరికీ చెప్పొద్దు..." అంటూ మంచుదిబ్బల చాటుకు పరుగుతీశాడు.

అనుసరించటానికి ప్రయత్నించాడు ఉలూ కొడుకు. మళ్ళీ ఏమనుకున్నాడో ఏమోగాని, ఆ ప్రయత్నాన్ని విరమించుకొని వెనుతిరిగాడు.

సూటిగా నామ్‌సో శిఖరంవైపు వెళ్ళాడు షాడో. పగలు పన్నెండు గంటలు అవుతుండగా శిఖరం మీదవున్న బండరాళ్ళను సమీపించాడు. వాటి మధ్య కూర్చుని ఆ చుట్టుపట్ల వున్న ప్రదేశాలనన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించాడు.

ఒక్క మంచుజీవి కూడా కనిపించటం లేదు ఎటుచూసినా, నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుంది మంచు మైదానం. బండ రాళ్ళ చాటున అడుగు జాడలు ఏవైనా కనిపిస్తాయేమోనని వెతికాడు. ఎంత వెతికినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. సూర్యుడు పడమటి దిక్కుకు మరల్తూ వుండటాన్ని గమనించి ఆరోజుకు తన సెర్చిని విరమించుకున్నాడు షాడో. మర్నాడు తన సరంజామానంతా వెంట తీసుకువచ్చి ఆ పర్వతాలలోనే కాంప్ వేయాలన్న నిర్ణయానికి వచ్చి, మెల్లిగా పర్వత శిఖరాన్ని అవరోహించి తమ కాంప్‌వైపు అడుగులు వేయటం ప్రారంభించాడు.

కొండ చెరియల్ని అధిగమించి అంతకుముందు ఎలుగుబంట్లతో పోరాడిన స్థలానికి వస్తుండగా దారిలో కనిపించింది ఒక సిగిరెట్ పీక.

చటుక్కున వంగి దాన్ని చేతిలోకి తీసుకున్నాడు. తన బ్రాండ్ కాదది. అక్కడపడి ఎంతోసేపు కాలేదు. ఆ పరసరాలనన్నిటినీ నిశితంగా పరీక్షిస్తూ అడుగు అడుగుచొప్పున ముందుకు సాగాడు.

ఒకచోట బూటు ముద్రలు కనిపించాయి. మంచు కురవటం ఆగిపోయింది. అందువల్ల అవి చెదిరిపోకుండా అలాగే క్లియర్‌గా కనిపిస్తున్నాయి. ఆ ముద్రలు తమ కాంప్‌వున్న ప్రదేశాన్ని ఫేస్ చేస్తూ వుండటాన్ని గమనించి ఆందోళనకు గురిఅయింది షాడో అంతరంగం.

ఆ రోజు వుదయం తను ఉలూ కొడుకుతో మాట్లాడిన ప్రదేశాన్ని సమీపిస్తుండగా అతని అనుమానం యదార్థం అని ఋజువుఅయింది.

ఉలూ ఫామిలీని వరుసల్లో నడిపిస్తూ వెనక్కి తీసుకువస్తున్నారు కొందరు వ్యక్తులు. మొత్తం పాతిక మంది

వున్నారు వారు. అందరి చేతుల్లోనూ ఆధునికమైన మిషన్ గన్స్ వున్నాయి. లీనాకోసం వెతికాయి షాడో కళ్ళు. కనిపించిందామె. ఉలూ భార్య వెనుక అడుగులు వేస్తోంది. యూబాను చేతుల్లోకి ఎత్తుకొని ఆమె వెనుక వస్తున్నాడు ఉలూ. అతని కొడుకులు షాడో బృందపు సరంజామావున్న కాన్వాస్ సంచులను మోసుకు వస్తున్నారు.

వారిని అనుసరించి ఎక్కడికి పోతారో చూద్దాం అన్న ఆలోచన వచ్చి, చల్లగా మంచుదిబ్బల చాటుకు తప్పుకున్నాడు షాడో.

అతనికి వందగజాల దూరంలోనుంచి నామ్సో పర్వత శిఖరంవైపు సాగిపోయింది ఆ ప్రొసెషన్. ఒక ఫర్లాంగు దూరం పోనిచ్చి. మెల్లగా వెంటాడటం ప్రారంభించాడు.

చీకటి పడే సమయానికి నామ్సో పర్వత పాదాన్ని సమీపించాడు వారందరూ. ఉన్నట్టుండి పెద్దగా అరిచి ఏదో ఆజ్ఞ జారీచేశాడొక వ్యక్తి.

వరుసల్లో నడుస్తున్న ఉలూ ఫామిలీ ఎక్కడి వారక్కడ చతికిలపడ్డారు. ఆ రాత్రికి అక్కడ కాంప్ వేయబోతున్నారని

గ్రహించి, వారిచుట్టూ రౌండ్ కొట్టి ఎత్తైన మంచు గుట్టమీదికి చేరుకున్నాడు షాడో.

మిషన్‌గన్స్ పట్టుకున్న వారందరూ వృత్తాకారంలో ఉలూ ఫామిలీ చుట్టూ కూర్చున్నారు. ఉన్నట్టుండి లేచి దగ్గర్లో ఉన్న యువతిచేయి పట్టుకొన్నాడొక వ్యక్తి. పెద్దగా అరిచి గోలచేయటం ప్రారంభించిందామె.

ఆ యువతి అరుపుల్ని కేర్ చెయ్యకుండా ఎత్తి భుజంమీద వేసుకున్నాడా వ్యక్తి. తన సహచరులతో ఏదో చెప్పి కొండ చెరియలమీద వున్న బండలవైపు బయలుదేరాడు.

అతనికంటే వేగంగా కదిలాడు షాడో. గుట్టదిగి అతను పోతున్న ప్రదేశానికి పరుగుతీసి బండలచాటున దాక్కున్నాడు.

షాడో కూర్చున్న ప్రదేశానికి పది అడుగుల దూరంలో ఆయువతిని దించాడతను. వెకిలిగా నవ్వుతూ ఆమె ప్రక్కన మోకరించాడు.

నీడలా అతనిమీదికి జంప్‌చేశాడు షాడో. ఉలిక్కిపడి తల ఎత్తాడతను. ఎత్తిన తల తిరిగి క్రిందికి దిగే అవకాశం

లేకపోయింది. బూటుకు బిగించివున్న డాగర్‌ని బయటకు లాగి అతని గుండెలమీద బలంగా పొడిచాడు షాడో. వెచ్చటిరక్తం వెల్లువలావచ్చి అతనిచేతిని తడిపింది. కిక్కురు మనకుండా మంచులో పడిపోయాడా వ్యక్తి. క్రిందవున్న అతని మిషన్‌గన్‌ని అందుకుంటూ, వెక్కి వెక్కి ఏడుస్తున్న యువతి భుజంతట్టి ఓదార్చాడు షాడో. ఉలూ ఆఖరి కోడలామె. షాడోని గుర్తించి ఆనందం పట్టలేక మరింతగా విలపించటం ప్రారంభించింది.

ఊరడించిన కొద్దీ ఆమె దుఃఖం ఎక్కువ అవుతుందని గ్రహించి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు షాడో. పొడుగాటి ఉన్నికోటును ధరించి వున్నాడు ప్రాణాలు పోగొట్టుకున్న వ్యక్తి. గుండెలమీది రక్తపు మరకల్ని లెక్కచేయకుండా ఆ కోటును విప్పి తను ధరించాడు షాడో.

పది నిమిషాలు వెయిట్‌చేసి బయలుదేరమని ఆ యువతికి సైగచేశాడు. వంద అడుగుల దూరంవరకూ సవ్యంగానే నడిచింది షాడో ఐడియా. తిరిగివస్తున్న యువతిని చూసి, నేనంటే నేను అని పోటీలు పడుతూ లేచి నిలబడ్డారు మరో యిద్దరు వ్యక్తులు.

"కొట్లాడుకోవటం బాగోలేదు. ఇక్కడ యింకా చాలామంది వున్నారు. ఒకరొకరుగా వెళ్ళిపద్దాం..." అంటూ సజెస్ట్ చేశాడొక వ్యక్తి.

పోటీలు పడుతున్న వారిలో ఒకతను సూటిగా షాడోవైపు వచ్చాడు. ఉన్నట్లుండి బిగ్గరగా ప్రతిధ్వనించింది అతని కంఠం...

"మోసం దగా... మోసం..."

ఛట్‌న మిషన్‌గన్‌ని భుజానికి ఆనించుకున్నాడు షాడో.

మిషన్‌గన్ మ్రోతలతో దద్దరిల్లిపోయింది నామ్‌సో పర్వతశ్రేణి. "చంపండి... చంపండి" అన్న అరుపులు బండరాళ్ళకు తగిలి మరింత బిగ్గిరిగా ప్రతిధ్వనించాయి.

బుల్లెట్లు తనమీదికి దూసుకురావటం గమనించి ఒక పల్లపు ప్రదేశంలోకి జంప్‌చేశాడు షాడో. రెండే రెండు నిమిషాల్లో ఎండ్ అయిపోయిందా పోరాటం. మిషన్‌గన్ మ్రోతలు చెయటం ప్రారంభించిన మరుక్షణం తలా ఒక దిక్కుకు చెల్లాచెదురై పోయారు ఉలూ కుటుంబ సభ్యులు. మ్రోతలు ఆగిపోయిన తర్వాత ఒకరొకరుగా బండల చాటునుండి యివతలకు

రాసాగారు.

"ఉలూ! నీవాళ్ళందరూ క్షేమంగా వున్నారా?" పల్లం నుంచి లేస్తూప్రశ్నించాడు షాడో.

అదే అతను చేసినతప్పు. అతని కంఠం వినిపించగానే గువ్వల్లా వచ్చి చుట్టుముట్టారు ఉలూ మనవరాళ్ళు నలుగురూ.

తెల్లవారగానే రాత్రి జరిగిన పోరాటం ఫలితాన్ని కళ్ళారా చూశాడు షాడో. ఉలూ ఫామిలీని బంధించిన పాతికమంది వ్యక్తుల్లో పదిమంది షాడో బుల్లెట్లకు ఆహుతి అయిపోయారు. మిగిలిన వారందరూ చీకటిమాటున చెల్లాచదరై ప్రాణాలు దక్కించుకున్నారు.

"పోయినవాళ్ళు మళ్ళీ తిరిగి రావచ్చు. ముందు మీ యిళ్ళను వదిలి మరొక ప్రదేశానికి పయనం కండి... మిగిలిన విషయాలు తర్వాత మాట్లాడుకుందాం...." అన్నాడు షాడో.

"మరి నువ్వు?" అడిగాడు ఉలూ.

"నేను తర్వాత వస్తాను. ముందు మీరు వెళ్ళండి..." అన్నాడు షాడో.

అతని ముఖంలో ప్రతిఫలిస్తున్న భావాలను గమనించి మారు మాటాడకుండా ప్రయాణానికి సిద్ధం అయింది ఉలూ ఫామిలీ. చిటికెలమీద అలా కాంప్‌లు మార్చటం వారికి అలవాటే. వారి సెటిల్‌మెట్‌లోకి వచ్చిన తర్వాత మొట్టమొదటి సారిగా షాడోకు ఎదురుపడింది లీనా.

"వెల్ మిస్టర్ షాడో. ఏమంటున్నారు నీ ప్రియురాళ్ళు ? " అని ఎత్తిపొడిచింది వెక్కిరింపుగా.

సమాధానం యివ్వలేదు షాడో. యూబాను జాగ్రత్తగా చూసుకోమని ఉలూకు చెప్పడమే కాక... తన ప్రియురాళ్ళకు ఖండితమైన ఉత్తరువులు జారీచేసి తన సరంజామలో నుంచి కొన్ని సామాన్లు ఎంచుకోవటంలో బిజీగా వున్నాడు.

"మొత్తానికి మీ ఇండియన్ బుద్దులు పోనిచ్చుకున్నావ్ కాదు. ఆడది సమీపిస్తే డ్యూటీ అనేది ఒకటి ఉందన్న సంగతి మరపుకు వచ్చేస్తుంది" మరింత ఎగతాళిగా అంది లీనా.

ఎంచుకున్న సామానంతా ఒక సంచీలో వేసి మూట కడుతూ, దూరంలో నిలబడివున్న ఉలూ రెండవ కొడుక్కు సైగ చేశాడు షాడో.

"నేను తిరిగి వచ్చేదాకా యీామెను ఎక్కడికీ కదలనీయకండి. అవసరం అయితే కాళ్ళు చేతులు కట్టిపడేయండి." అని ఆర్డర్ యిచ్చాడు.

కోపంతో కందగడ్డమాదిరి తయారైంది లీనా వదనం. పళ్ళు కొరుకుతూ, పిడికిలి బిగించి షాడోమీదికి దూకింది.

వెనుకనుంచి ఆమెను వడిసి పట్టుకొన్నాడు ఉలూ కొడుకు. కదలటానికి అవకాశం యివ్వకుండా ఒక చర్మపు త్రాటితో కాళ్ళు చేతుల్ని బిగించి కట్టేశాడు.

"మీ ట్రైనింగ్ కాంప్‌లో నువ్వూ, యూబా మాట్లాడుకోవటాన్ని విని, నన్ను చంపటానికి ఒక ఎక్స్‌పర్ట్‌ను పంపించారేమో అని భయపడ్డాను లీనా! యువ్వార్ నథింగ్" అంటూ వెనుదిరిగి నామ్‌సో పర్వత శ్రేణిలోకి బయలుదేరాడు షాడో.

రక్తంలేనట్లు పాలిపోయింది పురిమి చూస్తున్న లీనా వదనం.

* * *

నామ్‌సో శిఖరంమీదికి పోకుండా, దాని ప్రక్కనే వున్న ఒక చిన్న గుట్టమీద మకాం వేశాడు షాడో. తను తీసుకువచ్చిన సరంజామాలోనుంచి ఎండబెట్టిన మంచు ఎలుగు చర్మాన్ని తీసి మీద కప్పుకున్నాడు.

తెల్లగా వుండటంవల్ల అది దగ్గిర్నించి చూస్తేగాని క్లియర్‌గా కనిపించదు. కనిపించినా ఎలుగుబంటి అని పొరబడటానికి అవకాశాలు చాలా వున్నాయి. పై పెచ్చు దురుసుగా వీస్తున్న మంచు గాలి నుంచి రక్షణ కల్పిస్తుంది అది.

సాయం సమయం కాబోతుండగా షాడో నిరీక్షణ ఫలించింది. ఒక మంచు దిబ్బచాటునుండి యివతలకు వచ్చారు పదిమంది దృఢకాయులు. షాడో కూర్చున్న ప్రదేశానికి వంద గజాల దూరంలో నిలబడి బైనాక్యులర్స్‌ద్వారా ఆ ప్రదేశాలన్నిటినీ పరిశీలించటం ప్రారంభించారు.

వారిలో యిద్దరు వ్యక్తులు నామ్సో శిఖరంమీదికి ఎక్కుతూ వుండటాన్ని గమనించి ఎలుగుబంటి చర్మాన్ని మరింత బిగుతుగా చుట్టుకున్నాడు షాడో.

చీకటి పడేవరకు ఆ పరిసరాలను పరిశీలిస్తూనే వున్నారు వారు. చీకటి పడుతుండగా శిఖరంమీదినుంచి దిగి వచ్చారు పైకి పోయిన వారిద్దరూ. అందరూ కలిసి, వచ్చినదారినే మంచు దిబ్బలచాటుకు పోయి మాయం అయ్యారు. ఎలుగుబంటి మాదిరిగా అడుగులు వేస్తూ సాధ్యమయినంత వేగంగా వారి జాడల్ని అనుసరించాడు షాడో.

ఒక పెద్ద మంచు దిబ్బమీదికి పోయి హఠాత్తుగా అదృశ్యం అయ్యాయి ఆ వ్యక్తుల కాలిముద్రలు. చుట్టూ చూశాడు షాడో. నో! వాళ్ళు దిబ్బమీదినుంచి మరెక్కడికి పోలేదు. ఆ దిబ్బమీదికి ఎక్కగానే ఏదో గోల్‌మాల్ జరిగింది.

పాంటుజేబులోవున్న పెన్సిల్ టార్చిని బయటికి లాగి ఆ దిబ్బ వుపరితలాన్ని జాగ్రత్తగా పరిశీలించాడు. అరగంట తర్వాత తెలిసింది అసలు రహస్యం. వెంటనే క్రిందికి దిగి, అక్కడికి సమీపంలో వున్న మరో మంచు గుట్టమీద కాంప్ వేశాడు షాడో.

రాత్రి గడిచిపోయింది. వెలుగు వచ్చింది. తిరిగి మధ్యాహ్నం సమయం అవుతుండగా దడదడ లాడుతూ ప్రక్కకు తొలిగింది మంచుదిబ్బమీద ఒక భాగం. ఉన్నికోటు ధరించిన ఒకవ్యక్తి దిబ్బమీదికి వచ్చాడు. వెంటనే ద్వారం మూసుకుపోయింది.

అంతకంటే మంచి ఛాన్సు మరొకటి దొరకదని గ్రహించి, అతన్ని అనుసరించటం ప్రారంభించాడు షాడో. రెండు ఫర్లాగుల దూరం పోనిచ్చి వేగంగా పోయి అతన్ని ఒక గుట్టచాటున కార్నర్ చేశాడు.

షాడోని చూడగానే కోటు క్రింద దాచుకున్న రివాల్వర్‌ని బయటికి తీయటానికి ప్రయత్నించాడా వ్యక్తి. రివాల్వర్‌కి బదులు టార్చిలైటువంటి సాధనం చేతికి వచ్చింది. దాన్ని క్రిందికి వదిలి వట్టి చేతులతోనే షాడో మీదికి లంఘించాడతను.

అతనిచేతుల్ని తప్పించుకొని మోకాలితో పొట్టలో పొడిచాడు షాడో. పిడికిలి బిగించి మెడమీద గట్టిగా గుద్దాడు.

మారు మాటాడకుండా నేలకు వరిగి పోయాడా వ్యక్తి. అతని దుస్తుల్ని వూడదీసి తనుధరించాడు షాడో. తనదుస్తుల్ని

అతనికి తొడిగి ఒక బండచాటున పడుకోబెట్టాడు.

అతని చేతిలోనుంచి క్రిందపడిన సాధనాన్ని అందుకొని వేగంగా మంచుదిబ్బను సమీపించాడు.

టార్చిలైటు స్విచ్ నొక్కగానే కంటికి కనిపించని కిరణాలేవో మంచుమీదికి ప్రవహించటం ప్రారంభించాయి. ఆ సంకేతాన్ని అందుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలు రహస్య ద్వారాన్ని తెరిచాయి.

ఇనుపమెట్ల మీదుగా లోపలికి దిగాడు షాడో. వెంటనే ద్వారం మూసుకుపోయింది. లోపల పెద్ద భూగృహంలా కన్పిస్తోంది. ఎటు చూసినా పొడుగాటి కారిడార్స్ కన్పిస్తున్నాయి. వున్నికోట్లు ఐస్‌కాప్‌లు ధరించినగార్డులు రైఫిల్స్‌పట్టుకొని హడావుడిగా తిరుగుతున్నారు అటూ ఇటూ.

ముఖం కన్పించకుండా తన కాప్‌ని కళ్ళమీదికి లాక్కున్నాడు షాడో. తల వంచుకొని కన్పించిన కారిడార్‌లో అడుగులు వేయసాగాడు. ఉన్నట్లుండి ఒక మలుపు తిరిగిందది. కుడిఎడమలకు రెండుగా చీలింది.

ఎడమవైపున ఒక మూలగాపెద్ద పెద్ద చెక్కలు నిలబెట్టి వున్నాయి. వాటిదగ్గర నిలబడి తను ఎటుపోతే బాగుంటుందీ అన్న విషయాన్ని గురించి ఆలోచించటం ప్రారంభించాడు.

కారిడార్‌లో తిరుగుతున్న ఒక గార్డు....ఆ చెక్క పెట్టెల దగ్గరికి వచ్చి షాడోని ఎగా దిగా చూశాడు.

"ఇక్కడ ఏం చేస్తున్నావ్! బాస్ చూస్తే బాగోదు....నీ చోటికి నువ్వు వెళ్ళిపో...." అన్నాడు రైఫిల్‌ని క్రిందికి దించి ముఖం తుడుచుకుంటూ.

తల వంచుకొని ముందుకు అడుగు వేశాడు షాడో అంతలోనే "ఏయ్! అంటూ భుజంమీద చెయ్యివేశాడా గార్డు.

మెరుపులా పక్కకు తిరిగి అతని మెడమీద గుద్దాడు షాడో ఒక్కక్షణంకూడా ఆలస్యం చేయకుండా అతన్ని చెక్కపెట్టెల చాటూకు లాగి, అతని రైఫిల్‌ని భుజాన వేసుకున్నాడు.

అదే సమయంలో ఆ కారిడార్ ప్రతిధ్వనించేటట్టు వినిపించిందొక కంఠం, "అటెంక్షన్! అటెంక్షన్ ఎవ్రీబడీ! మన

స్థావరంలో యిద్దరు శత్రువులు ప్రవేశించారు....కారిడార్స్ అన్నిటినీ బ్లాక్‌చేయండి. స్థావరాన్నంతా చెక్ చేయండి!!!" అంటూ.

ఉలిక్కిపడి చుట్టూ చూశాడు షాడో.

లీనా!

ఇద్దరు శత్రువుల స్థావరంలో ప్రవేశించారని తెలియచేస్తోంది ఆ ఎనౌన్స్‌మెంట్. తను, లీనా, యూబాలు తప్ప అక్కడికి ఇతరులు వచ్చే అవకాశం లేదు. యూబా పక్కమీది నుంచి లేవలేదు. అతన్ని తీసేస్తే మిగిలింది ఒక్క లీనానే. ఉలూ కొడుకు కళ్ళుగప్పి తనను అనుసరించి వచ్చినట్లుంది!

బూట్లను టకటక లాడిస్తూ, అటూ యిటూ తిరుగుతున్న వ్యక్తుల్ని చూసేసరికి, వెంటనే అక్కడనుంచి బయటపడాలన్న కోరిక షాడో హృదయంలో, బలంగా పాతుకుపోయింది. వచ్చినపని కాకుండా పోవటం ఎలా?

చెక్కపెట్టెల చాటునుంచి యివతలకు వచ్చి, ఎడమ చేతివైపున కారిడార్‌లో అడుగు వేయటం ప్రారంభించాడు. ఒక మలుపు తిరుగుతూండగా ఎదురైనాడు ఇరవై సంవత్సరాలు కూడా పూర్తిగా నిండని యువకుడొకడు.

హఠాత్తుగా ఎదురువచ్చిన షాడోని చూసి ఆశ్చర్యంగా నోరు తెరిచాడతను. వెంటనే తన పొరపాటుని గ్రహించి సరిచేసుకోటానికి ప్రయత్నించాడు షాడో. వెనక్కి జరిగిన ఐస్ టోపీని కళ్ళమీదికి లాక్కుని హడావుడిగా ముందుకుపోయాడు.

"ఎవరు నువ్వు! ఆగు!!!" అంటూ చేతిలోని రైఫిల్‌ని పైకి ఎత్తాడు ఆ యువకుడు. ఆ రైఫిల్‌కంటే వేగంగా లేచి, కత్తిలా అతని మెడమీద పడింది షాడో ఎడమచేయి.

మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడా యువకుడు. అతన్ని పక్కకు లాగే వ్యవధిలేదు. అలాగే వదిలిపెట్టి పెద్దపెద్ద అడుగులు వేస్తూ ముందుకు కదిలాడు షాడో. కారిడార్ తర్వాత కారిడార్‌గా కనిపించిన ప్రతిదోవను జాగ్రత్తగా పరిశీలిస్తూ రౌండ్స్ కొట్టడం ప్రారంభించాడు.

పావుగంట తర్వాత, అతను అనుసరిస్తున్న దోవ ఒక చీకటి గదిముందు అంతమైపోయింది. తలుపులు లేని గది అది. అటూ యిటూ చూసి లోపలికి అడుగుపెట్టాడు షాడో. వంద అడుగుల వెడల్పు వుంది అది. రెండవ ప్రక్కన గుహ ద్వారం ఎంట్రెన్స్ ఒకటి వుంది.

నిశ్శబ్దంగా దాన్ని సమీపించి లోపలికి తొంగి చూశాడు.

ఒక చిన్న మలుపు తిరిగి మరో పెద్ద గదిలోకి పోతున్నదా దోవ. పట్టపగలు మాదిరి హైపవర్ లైట్లతో ప్రకాశిస్తున్నదా గది. గదిమధ్య పెద్దపెద్ద కాంక్రీట్ దిమ్మలున్నాయి. ఆ దిమ్మల మీద మర ఫిరంగులవంటి యంత్రాలు నాలుగు అమర్చబడి వున్నాయి. వాటిలోనుంచి అనేక రకాల వైర్లు ఒక పెద్ద జనరేటర్‌కి ఎటాచ్ చేయబడివున్నాయి. ఆ జనరేటర్ ముందు నిలబడి ఏదో విషయాన్ని గురించి మాట్లాడుకుంటున్నారు నలుగురు వ్యక్తులు.

"రేపు వుదయం ఎనిమిది గంటలకు పెకింగ్ నగరంలో, తొమ్మిది గంటలకు ఢిల్లీ నగరంలో ఎర్త్‌క్వేక్స్ ఆవిర్భవించాలి. ఇంకో రెండు మూడు గంటలు చూసి పనులు

ప్రారంభించండి..." అంటూ యివతలకు వచ్చాడొక చైనీయుడు.

ఆ అండర్ గ్రౌండ్ లేబరేటరీని నిర్మించటానికి మూల కారకులు ఎవరో ఎలా వుంటారో షాడోకి తెలియదు. చైనీయులు చెప్తారని అనుకున్నారు కులకర్ణిగారు. ఆయన చెప్పివుంటారని భావించారు కాబోలు ఆ వూసే ఎత్తలేదు చైనీయులు.

ఇవతలికి వచ్చిన చైనీయుడు తనను సమీపిస్తూ వుండటాన్ని గమనించి, పిల్లిలా చీకటి గదిలోకి పరిగెత్తాడు షాడో. అతని వెనుకను అటు వచ్చాడా చైనీయుడు. గోడను ఆనుకొని వున్న షాడోని గమనించకుండా, కారిడార్‌లోకి వెళ్ళిపోయాడు. వెంటనే కదిలాడు షాడో, యంత్రాలున్న గది ముందుకు పోయి, ఠీవిగా నిలబడ్డాడు ద్వారంలో.

జనరేటర్‌ని తుడిచి ఏవో మీటల్ని సరిచేస్తున్నారు అక్కడ మిగిలివున్న వ్యక్తులు.

ఉన్నట్లుండి తల ఎత్తాడొక వ్యక్తి. ద్వారంలో నిలబడివున్న

షాడోని గమనించి "ఎవరది? ఇక్కడికి ఎందుకొచ్చావ్?" అన్నాడు పురుములాంటి కంఠంతో.

చేతిలోని రైఫిల్‌ని ఎత్తి అతని గుండెలకేసి గురిపెట్టాడు షాడో. నిశ్శబ్దంగా వున్న ఆ గదిలో అతి ధారుణంగా ప్రతిధ్వనించింది దాని గర్జన.

గుండెల్ని అరచేతితో నొక్కుకుంటూ నేలకూలిపోయాడా వ్యక్తి. రైఫిల్ శబ్దాన్ని వినగానే చెరి ఒక మూలకూ పరుగుతీశారు మిగిలిన వారిద్దరు. ఒకతను గోడమీదవున్న ఎర్రటి స్విచ్‌ని పట్టుకున్నాడు. ఉన్న చోటునుంచి కదలకుండా రైఫిల్ బారెల్‌ని గిరుక్కున అటు తిప్పాడు షాడో. నిప్పులు వెదజల్లుతూ పోయి అతని కంఠంలో దిగబడింది బుల్లెట్.

ఆ కాస్త వ్యవధినీ వుపయోగించుకున్నాడు మూడవవ్యక్తి. చేతికి అందిన ఒక యినుప చువ్వను ఎత్తి షాడో మీదికి విసిరేశాడు. తల వంచి ప్రక్కకు దూకాడు షాడో. వెంటనే బాణంలా ముందుకు పరుగెత్తుకు వచ్చాడా వ్యక్తి. అతను ద్వారాన్ని సమీపిస్తుండగా రైఫిల్‌ని పక్కకు విసిరి కాళ్ళమీద కొట్టాడు షాడో. తల్లక్రిందులుగా పడ్డాడతను. తిరిగి లేచే

అవకాశం లభించలేదు. క్రిందికి దించిన రైఫిల్‌ని కొంచం పైకి ఎత్తి బారెల్ ముందున్న బాయ్‌నెట్‌ని పొట్టలో దించాడు షాడో. బాధగా మూలుగుతూ గిలగిలా కొట్టుకున్నాడతను. రెండు క్షణాల తర్వాత ఆగిపోయింది అతని కదలిక.

భుజానికి వ్రేలాడతీసివున్న సంచీని క్రిందికి దించి అందులోని సరంజామాను నేలమీద పరిచాడు షాడో. పాతిక డైనమైట్స్, వాటిని ప్రేల్చటానికి వుపయోగించే ఒక ఎలక్ట్రానిక్ డిటనేటర్ వున్నాయి. ఆ సరంజామాలో.

రెండు రెండు డైనమెట్లకు కలిపి కాంక్రీట్ దిమ్మల మీది యంత్రాలకు తగిలించాడు షాడో. జెనరేటర్‌కి నాలుగింటిని బిగించాడు. ఆగది నలుమూలలా నాలుగింటిని ప్లాంట్ చేసాడు. వాటి ఫ్యూజులను సన్నగా కత్తిరించి జనరేటర్ మీద పెట్టినవాటికి మాత్రం ఎలక్ట్రానిక్ డిటనేటర్ అమర్చాడు. టైంబాంబులాంటి సాధనమది. సరిగ్గా గంట తర్వాత ప్రేలుతుంది. ఆ తాకిడికి జనరేటర్ పగిలిపోయింది. జనరేటర్‌లో నుంచి వెలువడిన మంటలు మిగిలిన డైనమెట్లకు వ్యాపిస్తాయి. అవి ప్రేలటం ప్రారంభించి నామరూపాలు లేకుండా నాశనమైపోతుంది ఆ అండర్ గ్రౌండ్ లేబరేటరీ.

ఆఖరిసారిగా ఆ ఏర్పాట్లనన్నిటినీ ఒకసారి చూసుకొని చీకటి గదిలోకి వచ్చాడు షాడో. ఆ గది ద్వారాన్ని దాటుతుండగా ఎదురుగా వున్న గదిలో చిన్న రంధ్రం కనిపించింది. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కన్నం అది.

అటూ యిటూ చూసి ఫాంటు జేబులో వున్న చిన్న మెటల్‌బాల్‌ని బయటికు తీశాడు. గోలీ మాదిరిగా కన్పిస్తోంది అది. దాని మీద వున్న చిన్న బుడిపెను కొద్దిగా పక్కకు జరిపి, ఆ రంధ్రంలో వదిలి చేతులు దులుపుకున్నాడు.

తను వచ్చిన పని అయిపోయింది. ఇక బయటపడటం ఒక్కటే మిగిలివుంది. రైఫిల్‌ని భుజం మీద వేసుకొని, మెల్లిగా ద్వారంవైపు అడుగులు వేయటం ప్రారంభించాడు.

అంతకుముందు వచ్చేపోయే వారితో కొంచెం రద్దీగా వున్నట్లు కనిపించిన కారిడార్స్ అన్నీ నిర్మానుష్యమై పోయాయి. భయంకరమైన నిశ్శబ్దం ఆవరించుకుని వుంది ఆ ప్రదేశాన్ని.

ఎవరో తనను వాచ్ చేస్తున్నట్లు అనిపించి ఒక మలుపులో

ఆగాడు షాడో. ఎంత జాగ్రత్తగా చూసినా ఎవరూ కనిపించలేదు. భ్రమపడుతున్నానేమో అనుకుంటూ రెండడుగులు ముందుకువేశాడు.

మరుక్షణం బర్‌మని శబ్దంచేస్తూ, ప్రక్కకు తొలిగింది అతని ముందున్నగోడ. రైఫిల్స్‌ని రెడీగా పట్టుకొని కారిడార్‌లోకి అడుగుపెట్టారు పాతికమంది వ్యక్తులు.

వింటినుంచి వెలువడిన బాణంలా ప్రక్కకు తిరిగి మరో కారిడార్‌లోకి పరుగుతీశాడు షాడో, పది అడుగులు కూడా వేయకముందే ఎదురైనారు మరో పాతికమంది.

వారిని ఎదరించినందువల్ల నష్టం తప్ప లాభం ఏమీ లేదని గ్రహించి రైఫిల్‌ని క్రిందికి వదిలాడు షాడో, "లొంగిపోతున్నాను! నన్నేమీ చేయకండి!!" అంటూ చేతుల్ని గాలిలోకి ఎత్తి ఒక గోడకు ఆనుకొని నిలబడ్డాడు.

ముందుకు వచ్చి రైఫిల్‌ని తిరగేశాడొక వ్యక్తి. రైఫిల్ స్టాకు సరిగ్గా మోకాలిమీద తగలటంతో షాడో కళ్ళు బైర్లుక్రమ్మాయి. చూస్తుండగానే పడింది మరొక దెబ్బ. నిలబడటం

అసాధ్యమైపోయింది. ఏ మాత్రం ఎదిరించటానికి ప్రయత్నించినా ప్రాణాలు బలి పుచ్చుకోటానికి సిద్ధంగా వున్నారు వాళ్ళు. అసలు వాళ్ళు ఎదురుచూస్తున్నది కూడా అందుకే.

"పందిలా ఒదిగి నిలబడతావేమిటిరా? లేచి నిఠారుగా నిలుచో!" అంటూ లాగిపెట్టి చీలమండల మీద తన్నాడొక వ్యక్తి.

నేలమీద చతికిలపడ్డాడు షాడో. తల మీద దెబ్బ పడకుండా చేతులెత్తి తలకు అడ్డం పెట్టుకున్నాడు.

"ఏం చేద్దాం యితన్ని? చంపేద్దామా?" అడిగాడు ఒకవ్యక్తి.

"మన బాస్‌కి చూపించి చేద్దాం ఆ పని. ప్రాణాలతో దొరికిన వాళ్ళని వెంటనే చంపటం వల్ల వచ్చే లాభం ఏమీ వుండదు..." అన్నాడు. మరొకడు.

వెంటనే షాడో జుట్టు పట్టుకొని పైకి లేవదీశారు వారందరూ. వెనుక ముందూ నడుస్తూ ఒక కారిడార్ చివరకు తీసుకుపోయారు.

"జాగ్రత్తగా చూస్తూ వుండండి. నేను పోయి చెప్పి వస్తాను."

అంటూ గోడమీద అరిచేత్తో తట్టాడు ఒక వ్యక్తి.

కిరకిరలాడుతూ ప్రక్కకు తొలిగిందా గోడ. అద్దాలు బిగించి వున్న ఒక ఆఫీసు గది ప్రత్యక్షమయింది దాని వెనుక అద్దాల తలుపుల్ని అరచేత్తో తట్టాడతను.

"కమిన్" అంటూ వినవచ్చిందొక గంభీర స్వరం.

తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి పోయిన వ్యక్తి తిరిగి వచ్చేదాకా షాడోమీదినుంచి తమ దృష్టిని మరల్చకుండా కాపలా నిలబడ్డారు అతని సహచరులందరూ.

ఐదు నిముషాల తర్వాత వచ్చాడా వ్యక్తి. వెంటనే ఆ అద్దాల గదిలోకి తీసుకుపోబడ్డాడు షాడో.

లోపలికి అడుగుపెట్టిన మరుక్షణం ఒక కుర్చీలో కూర్చుని వున్న లీనాను చూశాడు షాడో. అతన్ని చూడగానే కాళ్ళకు చేతులకు కట్టి వున్న త్రాళ్ళను వదిలించుకోవాలని విపరీతమైన ప్రయత్నం చేసిందామె.

ఆ ప్రయత్నాలను గమనించినట్లు ఎదురువచ్చి షాడో ముందు నిలబడ్డాడు ఒక మధ్య వయస్కుడు.

"వెల్ వెల్ దిసీజ్ ఎ గ్రేట్ సర్‌ప్రైజ్ మిస్టర్ షాడో. మేము భారతదేశంలో భూకంపాలను సృష్టించటానికి ప్రయత్నిస్తే నువ్వు మమ్మల్ని వెతుక్కుంటూ బయలుదేరతావని మాకు తెలుసు. కాని యింత త్వరగా మా ఆచూకీ తీయగలవని మేము అనుకోలేదు. మా మూలకంగానైనా చైనా ఇండియాలు ఒకటైనందుకు ఎంతో సంతోషంగా వుంది. రియల్లీ ఐయామ్ వెరీ హేపీ!" అంటూ షాడో చెయ్యి పట్టుకొని లీనా ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చుండబెట్టాడు.

లీనా దుస్తులన్ని చిరిగి పేలికలై వున్నాయి. గులాబీ రేకులవంటి ఆమె బుగ్గలమీద ఎర్రటి బొబ్బలు కనిపిస్తున్నాయి. వక్షోజాల మీద కొరడాలతో కొట్టినట్లు వాతలు వున్నాయి.

ద్వారం దగ్గిర నిలబడివున్న వ్యక్తులను, వారి చేతుల్లోని రైఫిల్సునీ చూస్తూ ఆవ్యక్తి మాటలకు తలవూపాడు షాడో యధాలాపంగా

అంతలోనే ఆ గదిలోవున్న మరొక ద్వారం తెరుచుకున్నది. తెల్లటి దుస్తుల్ని ధరించిన నలుగురు చైనీయులు చిరునవ్వులు చిందిస్తూ ఆ గదిలోకి వచ్చారు.

వారెవరో షాడోకి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేకపోయింది. వారిని చూడగానే అసహ్యంతో మరింత కందిపోయాయి లీనా బుగ్గలు.

"ఓహ్! మిస్టర్ షాడో ఫ్రమ్ ఇండియా!! మిస్ లీనా ఫ్రమ్ చైనా!! కలలోకూడా ఎదురుచూడని సంభవం ఇది. ఈ చైనీస్ బ్యూటీ అందాల్ని చూసి మైమరచి వచ్చావా మైడియర్ షాడో? షాడో బుగ్గల్ని స్పృశిస్తూ మృదువుగా అడిగాడు ఒక చైనీయుడు.

"నో...నో...షాడోని చంపటానికి వుపయోగించబడ్డాను నేను. అతన్ని చంపటం కోసమే ఇక్కడికి వచ్చాను. మీ లేబరేటరీ సంగతి నాకేమీ తెలియదు..." వెంటనే అందుకున్నది లీనా.

ఆ మాటలు ఆమె నోటినుంచి వెలువడిన మరుక్షణం లాగిపెట్టి చెంపమీద కొట్టాడు ఒక చైనీయుడు. కుర్చీలోనుంచి జారి వెల్లికిలా పడిపోయిందామె.

"పట్టుబడిన క్షణంనుంచీ అదేమాట చెప్తున్నదామె" అంటూ షాడో ముందుకు వచ్చాడతను

"వెల్ మిస్టర్ షాడో! ఇంత జరుగుతున్నా నువ్వు పెదవి విప్పి ఒక్క మాట మాట్లాడకపోవటం నాకు వంతగా కన్పిస్తోంది. నీ గురించి మేము విన్నవన్నీ వట్టి కథలేనా?" జుట్టు పట్టుకొని అటూ ఇటూ తిప్పుతూ అన్నాడు.

"ఏమని మాట్లాడమంటారు? చీకటి గది వెనుక వున్న ఎలక్ట్రానిక్ గన్స్‌ని గురించి మాట్లాడనా?" అన్నాడు షాడో.

"అదీ... అలా వుండాలి.. ఇప్పుడు నువ్వు షాడోవే అని మాకు నమ్మకం చిక్కింది. చీకటి గది వెనుక వున్న ఎలక్ట్రానిక్ గన్స్‌ని గురించి నీకు అసలు ఏమీ తెలియదు. తలుచుకుంటే మీ భారతదేశాన్ని మొత్తం భూకంపాలతో గగ్గోలెత్తించే శక్తి వాటికి వున్నది. ఎక్స్‌పెరిమెంట్ కోసం రేపు ఢిల్లీ నగరాన్ని మరోసారి కదిలించబోతున్నాం... పెకింగ్ నగరాన్ని కూడా గడగడలాడిస్తాం... మాపరిశోధనల్ని గౌరవించకుండా మమ్మల్ని దేశంనుంచి బహిష్కరించినందుకు చైనాను నాశనం చేస్తాం. అపూర్వమైన ఖనిజ సంపత్తి కలిగివున్న భారతదేశాన్ని అల్లకల్లోలం చేసి మేమే ఆక్రమించుకొని ఏకఛత్రాధిపత్యంగా పరిపాలిస్తాం." అన్నాడు అంతవరకూ మౌనంగా వున్న మధ్య

వయస్కుడు.

"మీ ఆశలు అడియాశలు కాబోతున్నాయి. మీ స్థావరాన్ని చూడగానే మా ప్రభుత్వానికి వైర్‌లెస్ మెస్సేజీ పంపించాను. చైనీస్ బాంబర్ విమానాలు యీ పాటికి నామ్‌సో పర్వతాల మీద రౌండ్స్ కొడుతూ వుంటాయి..." అన్నది క్రిదపడిన లీనా లేచి కూర్చోవటానికి ప్రయత్నిస్తూ.

పెద్దగా నవ్వారు చైనీయులు. "నో నో మిస్ లీనా! నీ మాటలు నమ్మబుద్ధి కావటం లేదు. ఈ చుట్టుపట్ల యాభై మైళ్ళ దూరంలో వైర్‌లెస్ ట్రాన్స్ మీటర్లు ఏవైనా పనచేయటం ప్రారంభిస్తే వెంటనే మా ఎలక్ట్రానిక్ పరికరాలు ఆ విషయాన్ని పసికట్టి మాకు వార్నింగ్ యిస్తాయి. మీ దగ్గిర అటువంటి సాధనాలు లేవు. మాకు ఆ విషయం బాగా తెలుసు" అన్నాడు ఒక చైనీయుడు.

గాఢంగా నిట్టూర్చి కనులు మూసుకుంది లీనా.

చేయగలిగినంత చేసి చూపిందామె. ఆఖరికి ఓటమిని అంగీకరించక తప్పలేదు.

"వాట్ ఎబౌట్ యూ మిస్టర్ షాడో? నువ్వు కూడా ఏదైనా కథ చెప్పదలుచుకున్నావా?" వినోదంగా చూస్తూ షాడోని అడిగారు చైనీయులు.

గోడమీద గడియారాన్ని చూసి భుజాలు ఎగరవేశాడు షాడో. "ఇంకో ముప్పై అయిదు నిముషాల్లో మీ లేబరేటరీ సర్వనాశనం కాబోతున్నది. మీ కలల్ని కల్లలు కాబోతున్నాయి" అన్నాడు ముక్తసరిగా.

చప్పట్లు చరిచారు చైనీయులు.

గది బయట నిలబడివున్న సైనికులు ఒక గుడ్డమూటను తెచ్చి టేబిల్ మీద పెట్టారు. అందులో ఏవో విలువైన వస్తువులు వున్నట్లు అతి జాగ్రత్తగా విప్పాడు మధ్య వయస్కుడు.

ఎలక్ట్రానిక్ గన్స్‌కీ, జనరేటర్‌కీ ఆ గది గోడలకు తను అమర్చి వచ్చిన డైనమెట్లను చూసి ఆశ్చర్యంగా విజిల్ వేశాడు షాడో.

"ఇప్పుడు చెప్పు మిస్టర్ షాడో! తెలివితేటలు నీ ఒక్కడి సొత్తే కాదని వప్పుకుంటావా?" అడిగారు చైనీయులు.

టేబిల్‌మీది సామానులలో మెటల్ బాల్ లేకపోవటాన్ని గమనించి తేలికగా నిట్టూర్చాడు షాడో. "మీరు కనిపెట్టాలనే వీటిని కనిపించే విధంగా అమర్చివచ్చాను మీకు కనిపించని ప్రదేశాలలో వున్నవాటిని చూడలేకపోయారు మీరు. ఇంకో ముప్ఫై నిముషాల్లో మీ పని క్లోజ్ అయిపోతుంది." అన్నాడు గంభీరంగా.

ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు చైనీయులు. మధ్య వయస్కుడి ముఖంలో రకరకాల భావాలు కదలాడటం ప్రారంభించాయి. షాడో మాటల్ని నమ్మబుద్ధి కావటం లేదు వారికి. కాని నమ్మకుండా వుండటానికి లేదు. టేబిల్‌మీద వున్న డైనమెట్లు చాలా పవర్ వున్నటువంటివి. వాటిలో ఏ ఒక్కటి ప్రేలినా ఆ అడర్ గ్రౌండ్ లేబరేటరీ ఎందుకూ పనికి రాకుండా పోతుంది.

షాడో అంటున్నట్లు తమకు కనిపించనివి యింకెక్కడైనా వున్నాయా?

గబగబా డ్రాయర్ తెరిచి అందులోని మైక్రోఫోన్‌ని అందుకున్నాడు ఒక చైనీయుడు. కారిడార్స్‌లో వున్నన లౌడ్

స్పీకర్స్ అన్నీ పనిచేయటం ప్రారంభించాయి.

"ఎలక్ట్రానిక్స్ గన్స్ వున్న గదిని అంగుళం కూడా వదిలిపెట్టకుండా వెతకండి. అనుమానించదగ్గ వస్తువేమైనా కనిపిస్తే వెంటనే దాన్ని ఆ గదిలోనుంచి తొలగించి వేయండి. వెరీ అర్జంట్!" ఖంగుమంటూ ఆర్డర్స్‌ని పాస్ చేసింది చైనీయుడు కంఠం.

గది ద్వారం దగ్గర నిలబడిన వ్యక్తులలో కలకలం రేగింది. లేబరేటరీ కూలిపోవటానికి సిద్ధంగా వున్నదని తెలిసేసరికి ఎవరికి వారు అక్కడినుంచి పారిపోయి ప్రాణాలు దక్కించుకోవాలని ఆలోచించటం ప్రారంభించారు.

కాళ్ళను వెనక్కి మడిచి బొటన వేళ్ళ మీద బరువునంతా మోపాడు షాడో. గదిలో వున్న ఆయుధధారులు యిద్దరే యిద్దరు. వారిద్దరూ ద్వారం దగ్గిర నిలబడి వున్నారు. ప్రమాదం అంటూ వస్తే వారవైపునుంచే వస్తుంది.

"వెల్ మిస్టర్ షాడో!" అంటూ షాడో ఆలోచనలకు అడ్డం వచ్చారు ఆ చైనీయులు.

"బాధను భరించటంలో నిన్ను మించిన వారెవరూ లేరని విన్నాం. ఆ మాటలో నిజం ఎంతున్నదో తేల్చుకోవాలని కుతూహల పడుతున్నాం. నువ్వు బాధతో గిలగిల్లాడుతుంటే నీ శత్రువు అయిన యీ చైనీస్ బ్యూటీ ఎలా రియాక్ట్ అవుతుందో చూడాలని మాకు కోరికగా వుంది." షాడో జుట్టు పట్టుకొని ఒక బ్లేడును ముఖం మీద ఆనిస్తూ అన్నారు వారిలో యిద్దరు.

"మిగిలిన డైనమెట్లు ఎక్కడ వున్నాయో చెపితే, నీకు యీ బాధ నుంచి విముక్తి లభిస్తుంది. నా మాట విని వాటిని ఎక్కడ పెట్టావో చెప్పు" సలహా యిచ్చాడు మధ్య వయస్కుడు.

షాడో నుదుటి మీద చిన్న గాటు పెట్టింది బ్లేడు. రక్తం బొట్లుబొట్లుగా కారి షాడో పెదిమల మీదకి జారటం ప్రారంభించింది.

ఎదురుగా వున్న గోడగడియారం పైపు చూశాడు షాడో. మెటల్ బాల్ డిటనేట్ కావటానికి సరిగ్గా పదహేను నిముషాలు మాత్రమే వుంది వ్యవధి.

ఉన్నట్లుండి కుర్చీలోనుంచి లేచాడు. కుడిచేతిని పక్కకు

తిప్పి కుర్చీవెనుక నిలబడివున్న చైనీయుడి మెడమీద పొడిచాడు. అదే వూపులో పక్కకు దూకి, బ్లేడు పట్టుకొని వున్న చైనీయుడి పొట్టలో ఎడమ పిడికిలిని దింపాడు. బాధగా అరుస్తూ నేలకూలిపోయారు వారిద్దరూ.

"చంపండి...చంపండి..."బిగ్గరగా అరిచారు మిగిలిన చైనీయులు యిద్దరూ. బంతిలా గాలిలోకి లేచాడు షాడో.

వన్ టూ వన్ టూ అని లెక్కపెట్టి వారిద్దరి వక్షస్థలాల మీద కాళ్ళతో తన్నాడు. నేలకు తాకిన మరుక్షణం గాలిలోకి పల్టీకొట్టి మధ్య వయస్కుడి మీద పడ్డాడు.

ద్వారం దగ్గిర వున్న గార్డులు తెలివి తెచ్చుకున్నారు. ధనాధన్‌మని గర్జించింది ఒక రైఫిల్, దాని బుల్లెట్లు షాడో ఎడమ భుజంమీద దిగబడ్డాయి. రైఫిల్‌ని స్టెడీ చేసుకుంటున్నాడు రెండవ గార్డు.

మధ్య వయస్కుడి తలమీద అరచేత్తో చరిచి క్రింద పడ్డాడు షాడో. చేతికి అందిన ఒక ఛైర్‌ని తీసి గార్డుల వైపు విసిరాడు బలంగా.

కోటుజేబులోనుంచి రివాల్వర్‌ని తీయటానికి ప్రయత్నిస్తున్నాడు మధ్య వయస్కుడు. అంతవరకూ కదలకుండా పడివున్న లీనాలో చలనం వచ్చింది ఒక్కసారిగా.

చేతులకు బిగించి వున్న త్రాళ్ళు చర్మాన్ని కత్తిరించేస్తున్నట్లు బాధ పెడుతున్నా లెక్కచేయకుండా పక్కకు దొర్లి మధ్య వయస్కుడి కాళ్ళకు అడ్డు పడింది.

"డర్టీబిచ్! నిన్ను ఎప్పుడో చంపేయాల్సింది." అంటూ వెనక్కు తూలాడతను. ఆకాస్త వ్యవధిని చక్కగా వుపయోగించుకొని, అతని చీలమండల మీద తన్నాడు షాడో. బాలెన్స్ నిలుపుకోలేక వెల్లకిలా పడిపోయాడతను. అతని చేతిలోని రివాల్వర్ జారి క్రింద పడింది. ఒక్క గంతులో పోయి దాన్ని చేజిక్కించుకున్నాడు షాడో. ట్రిగ్గర్ రాడ్ మీద వేలు పెడుతూనే రివాల్వర్‌ని ద్వారం దగ్గిర వున్న గార్డుల కేసి గురిపెట్టాడు.

టేబిల్ ఛైర్లు అడ్డు రావటం వల్ల వారికి గురి అందటం లేదు. రైఫిల్స్‌ని పట్టుకొని అటూ ఇటూ తిప్పుతున్నారు.

భీకరంగా గర్జించింది షాడో చేతిలోని రివాల్వర్. గార్డుల పని అయిపోయింది. తమ రైఫిల్స్‌ని షాడో కేసి ఎయిమ్ చేసే అవకాశం లభించకముందే వారి ప్రాణాలను బలిపుచ్చుకున్నాయి షాడో ప్రయోగించిన బుల్లెట్లు.

ఎడమ భుజం మీద దిగబడిన బుల్లెట్లు పెడుతున్న బాధను సరకు చేయకుండా లేచి టేబిల్‌మీద డైనమెట్లను అందుకున్నాడు షాడో. జేబులో వున్న లైటర్‌ని వెలిగించి డైనమెట్స్ ముందు భాగంలో వున్న ఫ్యూజులను అంటించాడు..

"గెటప్ లీనా! హర్రీ!!" అని లీనాను హెచ్చరిస్తూ వాటిని ద్వారంవైపు విసిరేశాడు.

గాలిలో వుడగానే పేలిపోయాయవి. ఆ అదుటుకు అద్దాల తలుపు ముక్కలు ముక్కలైపోయింది. దానికి అడ్డుగా వున్న గోడలో లారీ ప్రవేశించేటంత రంధ్రం ఏర్పడింది. గోడ గడియారం వైపు చూశాడు షాడో. సరిగ్గా పదమూడు నిముషాలు మాత్రమే వ్యవధి. పగిలిపోయిన గోడ దగ్గిర అడుగుల శబ్దం వినవచ్చింది.

"బాస్!!" అంటూ లోపలికి తొంగి చూశారు యిద్దరు గార్డులు.

రివాల్వర్‌ని వారికేసి త్రిప్పి ట్రిగ్గర్ నొక్కాడు షాడో.

అదిరి పడి వెనక్కు గెంతారు వారిద్దరూ.

"రాజూ! రాజూ!!" అని పిలిచింది లీనా. లేచి నిలబడటం ఆమెకు చేతకావటం లేదు.

క్రింద పడిన చైనీయులు అటూ ఇటూ కదులుతున్నారు. టేబిల్ దగ్గిర పడిన బ్లేడును చూసి దాన్ని అందుకున్నాడు షాడో. హడావిడిగా కోయటంలో లీనా మణికట్లు బ్లేడు బారిన పడ్డాయి.

"ఇంకో పదినిముషాలలో అంతా అయిపోతుంది. హర్రీ అప్!!!" అంటూ ఆమెను ద్వారం వైపు తోసి డ్రాయర్‌ని తెరిచాడు షాడో.

"మరినువ్వు?" కదలకుండా అలాగే నిలబడింది లీనా.

పళ్ళుకొరుకుతూ చెంపమీద కొట్టాడు షాడో..."గెటవుట్!" అని అరిచాడు కోపంగా.

మారుమాటాడకుండా వెనుతిరిగింది లీనా. పడిపోయిన గార్డుదగ్గర రైఫిల్‌ని తీసుకొని కారిడార్ లోకి పరిగెత్తింది.

డ్రాయర్‌లోవున్న మైక్రోఫోన్‌ని యాక్టివేట్ చేశాడు షాడో.

"అటెంక్షన్ ఎవ్రీబడీ...అటెంక్షన్!! ఇంకో పదినిముషాలలో లేబరేటరీ పేలిపోతుంది. ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను వుపయోగించి ప్రాణాలుకాపాడుకోండి...క్విక్ అని హెచ్చరించి మైక్రోఫోన్‌ని నేలకేసి కొట్టాడు.

కారిడార్స్‌లో గందరగోళం స్టార్ట్ అయింది. టేబిల్ దగ్గిర పడివున్న చైనీయుల వైపు చూసి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

వారిని రక్షించే అవకాశం లేదు. వారిని మోసుకుపోయే ఓపిక వ్యవధి తనకు లేవు. రివాల్వర్‌లో వున్న బుల్లెట్లను పరిశీలిస్తూ ద్వారంవైపు బయలుదేరాడు. కాళ్ళు ఏక్షణంలోనయినా మడత పడేటట్లు కనిపిస్తున్నాయి. భుజంమీది గాయాలు. శరీరంలో వున్నశక్తినంతా హరించి వేస్తున్నాయి. లేబరేటరీకి వున్న

ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లన్నీ తెరుచుకొన్నాయి. గుంపులుగుంపులుగా బయటికి పరిగెత్తుతున్నారు గార్డులు. తమ మధ్యగా పైకి వస్తున్న షాడోని గురించి వారెవరూ పట్టించుకోలేదు.

మంచుగుట్ట మీదికి పోగానే  నిర్మానుష్యంగా వున్న నామ్‌సో పర్వత శ్రేణి వైపు అడుగులు వేశాడు షాడో. వంద గజాల దూరంకూడా పోకముందే చీకటి గది ముందు పడేసిన మెటల్ బాల్ శబ్దాలు చేస్తూ ప్రేలిపోయింది.

భూకంపం వచ్చినట్లు కంపించిపోయింది నామ్‌సో పర్వత శ్రేణి. పర్వత శిఖరాల మీద బండలు క్రిందికి దొర్లటం ప్రారంభించాయి ఆ అదుటుకు.

లేబరేటరీ వున్న ప్రదేశంలో  ఎర్రటి జ్వాలల్ని విరజాస్తూ, భూమిమీదకి వచ్చాయి మంటలు.  రాక్షస పాదం ఏదో అదిమి పెట్టి నొక్కినట్లు లోపలికి కూరుకుపోయింది మంచుగుట్ట.

ప్రపంచాన్ని ఏదో చేద్దామని అనుకున్న సైంటిస్టులు ఆ ప్రేలుడులోపడి మాడిపోయారు. తప్పించుకోగలిగిన వారి గార్డులు  వెనక్కి కూడా తిరిగి చూడకుండా మంచు మైదానంలో పరుగులు ప్రారంభించారు. తప్పించుకోలేని

వాళ్ళు ఆ ప్రేలుడులో పడి భూస్థాపితం అయిపోయారు.

ఒక బండ చాటున కూర్చుని ఆ భీబత్స దృశ్యాన్ని చూశాడు షాడో. గాఢంగా నిట్టూరుస్తూ లేచి నిలబడ్డాడు. కాళ్ళు చచ్చుపడి పోయినట్లు అనిపించి తిరిగి నేలమీదే చతికిలపడిపోయాడు.

పదినిముషాలు ఆగి మరో ప్రయత్నం చేశాడు. కాళ్ళు చచ్చుపడి పోయినట్లు అనిపించి తిరిగి నేల మీదే చతికిలపడిపోయాడు.

పదినిముషాలు ఆగి మరో ప్రయత్నం చేశాడు. తూలుతూ తూలుతూ లేచి నిలబడేసరికి ఎదురుగా ప్రత్యక్షమైంది లీనా. ఆకలిగా షాడో గుండెల వైపు చూస్తోంది. ఆమె చేతిలోని రైఫిల్.

******************

"ఎదురు చూస్తున్న అవకాశం యిప్పటికి లభించింది మిస్టర్ షాడో! మా ప్రభుత్వానికి ఎడతెగని తలనొప్పుల్ని సృష్టించిన నీ బ్రతుకు యింకొక క్షణంలో తెల్లవారబోతున్నది." రైఫిల్ స్టాకు మీది నుంచి షాడో వంక చూస్తూ గుంభనంగా నవ్వింది లీనా.

ముందుకు అడుగు వేయబోయాడు షాడో. కళ్ళు పచ్చబడి నేలకు జారిపోయాడు.

"నన్ను సీక్రెట్ బ్రాంచిలో చేర్చుకున్నది యిందుకోసమే. నాకు ట్రైనింగ్ యిచ్చింది కేవలం నిన్ను అడ్డు తొలగించుకోవటానికే. మనం వచ్చినపని జయప్రదంగా నెరవేరింది. ఇక నేను వచ్చిన పని సక్సెస్ కాబోతున్నది." అంటూ ట్రిగ్గర్ రాడ్ మీది ఫింగర్‌ని బిగించింది లీనా.

పెదవులు బిగపట్టి శరీరంలో శక్తినంతా పాదాల్లోకి కేంద్రీకరించుకున్నాడు షాడో. మెల్లగా లేచి నిలబడి సూటిగా లీనా కళ్ళలోకి చూశాడు.

"నిన్ను చంపటానికి నేను పనికి రానని అన్నావ్ ఉలూ కొడుకుతో. ఇప్పుడు ఎవరు ఎవరికంటే అధికులో తెలిసిందా?" ఎంత ట్రైనింగ్ తీసుకున్నా లీనా ఒక స్త్రీ. దెబ్బకుదెబ్బ కొట్టకపోతే ఆమెకు తృప్తి కలగదు.

షాడో మాటల్ని షాడోకే వప్పచెప్పాలన్న కక్షతో ఒక ముఖ్య విషయాన్ని మర్చిపోయింది. అటు తూలి యిటు తూలి

ఆమెకు ఐదు అడుగుల దూరంలో నిలబడ్డాడు షాడో.

ఆమె మాటలు ముగిసిన మరుక్షణం చెవులు చిల్లులు పడేటట్లు అరుస్తూ గాలిలోకి ఎగిరాడు. పటామని శబ్దం చేస్తూ ఎగిరి అవతల పడింది ఆమె చేతిలోని రైఫిల్. ఆ కాలు క్రింద ఆనకముందే మరింత వేగంతో పైకి లేచింది ఎడమకాలు.

అదిరిపడి వెనక్కు గెంతింది లీనా. అప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది. షాడో ఎడమకాలు ఆమె కుడి భుజానికి తగిలింది. పద అడుగుల దూరంలో పడింది లీనా. కళ్ళ ముందు యింద్రధనుస్సులు స్పృహ తప్పి తల వాల్చేసింది.

నీరసంగా మంచులో కూలబడిన షాడోని చుట్టుముట్టారు ఉలూ ఫామిలీ. పర్వతాలలో ఏవో శబ్దాలు వినరావటాన్ని గమనించి ఏమిటో చూద్దామని వస్తున్నారు వారు.

ఉలూ సాయంతో నీరసంగా నడచివచ్చిన యూబా.

షాడో ముందు మోకరించి చేతులు పట్టుకున్నాడు.

"నిన్ను చంపటానికి వచ్చాను నేను. నీ రైఫిల్‌లో డమ్మీ బుల్లెట్లు పెట్టినందుకు నాకు తగిన శాస్తి జరిగింది. మిస్టర్

షాడో! నువ్వొక రాక్షసుడవనీ...మనుషులని చంపటం అంటే నీకు విపరీతమైన ఆనందమనీ.... మాకు నూరి పోసింది మా సీక్రెట్ బ్రాంచి. కాని, నువ్వు తీసే ప్రాణాలకంటే, కాపాడే ప్రాణాల సంఖ్య చాలా ఎక్కువగా వుంటుందని యిప్పుడు తెలిసింది నాకు." అన్నాడు గద్గద స్వరంతో.

"ఉలూ....ఇతన్నీ ఆమెనూ...మంచు మైదానం చివరకి చేర్చి రాగలవా..." అని అడిగాడు షాడో ఉలూ వైపు తిరుగుతూ.

"మరి నువ్వు?" అనుమానంగా అడిగాడతను.


తన భుజం మీది గాయాలకు కట్టుకడుతున్న యువతుల వైపు చూసి నవ్వాడు షాడో.

యూబా చేయి పట్టుకొని గుట్ట క్రిందికు లాక్కుపోయాడు ఉలూ. స్పృహలేని లీనాను భుజంమీద వేసుకొని అతన్ని అనుసరించాడు పెద్ద కొడుకు

వాళ్ళు కనుమరుగు అయ్యేదాకా చూస్తూ నిలబడిపోయాడు షాడో.

"ఇగ్లూ ఎక్కడ వుంది?" అని అడిగాడు తన ప్రియురాళ్ళ వైపు తిరుగుతూ...మహదానందంగా దారి చూపించారు వాళ్ళు.

--:జైహింద్:--


Chinese Beauty
MADHU BABU